
అధికారులపై చర్యలు ?

తురకపాలెంలో వరుస మరణాల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన జిల్లా అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. ఆ మేరకు ప్రభుత్వం ఈ వ్యవహారంపై విచారణకు ఆదేశించినట్లు తెలుస్తుంది. ఒకరిద్దరు జిల్లా అధికారులు మితిమీరిన నిర్లక్ష్యం ప్రదర్శించినట్లుగా నిఘా వర్గాలు కూడా తేల్చినట్లు సమాచారం.



నిర్లక్ష్యమే.. శాపం

తురకపాలెంలో 29 మంది బలి

- వరుస మరణాల్లో విస్తుపోయే వాస్తవాలు
- ప్రాణాలు పోతున్నా పట్టించుకోని ఆరోగ్యశాఖ
- ప్రజాప్రతినిధులు చెప్పినా స్పందనలేని అధికారులు
- ఒక్కో నెలలో పది మంది మరణించినా పట్టించుకోని వైనం

ఒకరు.. ఇద్దరు కాదు.. 29 మంది మరణించారు. అదీ మూడు నెలల్లోనే. అదేమన్నా మారుమూల గ్రామం.. సమాచారం తెలుసుకోవడం కష్టం అంటే జిల్లా కేంద్రమైన గుంటూరుకు కూతవేటు దూరంలోనే ఉంది. సరే అదేదో పెద్ద గ్రామం నెలలో పది మరణాలు సర్వ సాధారణం అనుకునేందుకు కూడా ఆస్కారం లేదు. ఐదారొందల కుటుంబాలు.. 2300 జనాభా ఉన్న ఓ చిన్న గ్రామం. అయినా వరుస మరణాలు.. అదీ జ్వరం, దగ్గు, ఆయాసం లాంటి సాధారణ రోగాలతో అత్యంత తక్కువ రోజుల్లోనే మరణాలు సంభవించాయి. అయినా వైద్య ఆరోగ్య శాఖతో పాటు జిల్లా స్థాయి అధికారుల్లో కనీస స్పందన లేదంటే వారెంత నిర్లక్ష్యంగా వ్యవహరించారో తెలుసుకోవచ్చు. ఒకే నెలలో.. ఒకే ఊరిలో డజన్ల కొద్దీ సంఖ్యలో మరణిస్తుంటే జిల్లా ఉన్నతాధికారులు ఏమి చేస్తున్నారన్న ప్రశ్న ఉద్భవిస్తుంది. మీడియాలో కథనాలు వచ్చిన తర్వాత రాష్ట్ర స్థాయి అధికారులు హెచ్చరించిన తర్వాత ఇప్పుడు హడావుడి చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జూలైలోనే స్పందించి ఉంటే మరణాలను తగ్గించే అవకాశం ఉండేది కదా అన్న అభిప్రాయాలు వస్తున్నాయి. అధికారుల నిర్లక్ష్యం 29 మందిని బలితీసుకుందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

(గుంటూరు సిటీ, తెనాలి ఆంధ్రజ్యోతి)

గుంటూరు నగర శివార్లలోని ఓ చిన్న గ్రామం తురకపాలెం. ఈ గ్రామం ఇప్పుడు రాష్ట్రవ్యాప్త సంచలనమైంది. వరుసగా.. సాధారణ జబ్బులతో చికిత్సలు పొంది ఇళ్లకు వచ్చిన తర్వాత అంతుచిక్కని రీతిలో సంభవిస్తున్న మరణాలతో గ్రామస్థులు భయం గుప్పిట్లో చిక్కుకున్నారు. ఇప్పుడు కేంద్ర, రాష్ట్ర మంత్రుల పర్యటనలు.. వైద్య ఆరోగ్యశాఖ అధికారుల వైద్య శిబిరాలతో హడావుడి చేస్తున్నారు. అదే తొలుతే అధికారులు స్పందించి ఉంటే మరణాలు కొన్ని అయినా తగ్గి ఉండేవి కదా అని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఓ చిన్న గ్రామంలో డజన్ల కొద్దీ మరణాలు సంభవించినా వైద్య ఆరోగ్య శాఖతో పాటు ఇతర జిల్లా స్థాయి అధికారులు పట్టించుకోకపోవడంతోనే వరుస మరణాలు సంభవించాయన్న ఆరోపణలు వెల్లువెత్తు తున్నాయి. అధికారుల నిర్లక్ష్యం.. 29 మంది పాలిట మరణశాసనమైందన్న విమర్శలు వస్తున్నాయి. జిల్లా కేంద్రమైన గుంటూరుకి నాలుగైదు కిలో మీటర్ల దూరంలోని తురకపాలెం గ్రామంలో కేవ లం జ్వరం.. దగ్గు.. ఆయాసంతో బాధపడతూ 29 మంది మరణించారంటే వైద్య ఆరోగ్య శాఖలోని నిర్లక్ష్యం ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవచ్చు. సా ధారణంగా ఒక్కరు చనిపోయినా హడావిడి చేసే వైద్య, ఆరోగ్యశాఖ తురక పాలెంలో ఇంత మంది వరుసపెట్టి మరణిస్తున్నా చోద్యం చూస్తూ కూర్చుంది. వరుస మరణాల విషయం సంచలనంగా మారి.. రాష్ట్రవ్యాప్తంగా చర్చ జరిగే వరకు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు ఆ గ్రామం వైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. సాధారణంగా ఒక డయేరియా మరణం సంభవిస్తే దానికి సంబంధించిన సమాచారం 24 గంటల్లో ప్రపంచ ఆరో గ్య సంస్థకు తెలియజేయాలి. మరి జ్వరంతో ఎవ రైనా మరణించినా.. అది కూడా సీరియస్ అంశమే. క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టాలి. గుంటూరు సమీ పంలోని తురకపాలెంలో సంభవించిన మరణాల విషయంలో వైద్య, ఆరోగ్య శాఖ అటువంటి చర్యలు (మిగతా 8వ పేజీలో)


గ్రామస్తులకు భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే రామాంజనేయులు


నిర్మానుష్యంగా తురకపాలెం వీధులు



గ్రామంలో ముమ్మరంగా సహాయ చర్యలు

అనుమానితుల నుంచి రక్తనమూనాల సేకరణ

గుంటూరు మెడికల్ : వరుస మరణాలు.. వీడని జ్వరాలతో భీతిల్లిన తురకపాలెంవాసులకు వైద్యంతో పాటు ఆహారం, తాగునీటిని అధికారులు అందిస్తున్నారు. శుక్రవారం సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్షతో శనివారం ఆయా శాఖలకు చెందిన అధికారులు రంగంలోకి దిగారు. ఈ క్రమంలో వైద్య ఆరోగ్య శాఖ ఇంటింటి సర్వే చేపట్టి రక్తనమూనాలు సేకరించింది. మెలియోయిడోసిస్ జ్వరాలు ప్రబలినట్లు అనుమానిస్తున్న నేపథ్యంలో మంగళగిరిలోని ఎయిమ్స్ వైద్యులు గ్రామాన్ని సందర్శించారు. మరో పక్క గ్రామస్థులకు శనివారం భోజన సదుపాయం కల్పించారు. మూడు రోజుల పాటు అందరికీ ఉచితంగా భోజనం ఏర్పాటు చేసినట్లు ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. అందరికీ మినరల్ వాటర్‌ను పంపిణీ చేశారు. ప్రజా, వైద్య సంఘాలు, సేవా సంస్థల ప్రతినిధులు నిజ నిర్ధారణ కమిటీగా ఏర్పడి శనివారం గ్రామంలో పర్యటించారు.

పరిస్థితులు అదుపులో ఉన్నాయి..: కలెక్టర్

గుంటూరు : తురకపాలెంలో పరిస్థితులు అదుపులో ఉన్నాయని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. గ్రామంలోని పరిస్థితుల గురించి శనివారం మీడియాకు వివరించారు. 650 ఇళ్లలో సర్వే నిర్వహించి సింప్టమెటిక్ కేసులకు సంబంధించి 56 మందికి బ్లడ్ కల్చర్ తీసి మెడికల్ కళాశాలకు పంపించామన్నారు. 50 బృందాలతో గ్రామంలోని అన్ని ఇళ్లకు వెళ్ళి ఆరోగ్యానికి సంబంధించి 41 అంశాలపై సర్వేను శనివారం నుంచి ప్రారంభించినట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయి నోడల్ ఆఫీసర్స్ బృందం వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించి కార్యక్రమాల ను పర్యవేక్షిస్తుందన్నారు. శనివారం సాయంత్రం 6 గంటల వరకు 895 మందికి వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. 2,850 మందికి ఉపాహారం, 3500 మందికి మధ్యాహ్న భోజనం అందించినట్లు తెలిపారు. గ్రామంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించామన్నారు. ప్రాం తీయ లేబరేటరీలలో నీటి నమూనాలను పరీక్షించగా అందులో ఎటువంటి హానికార రసాయనాలు, పదార్థాలు లేవని నివేదిక వచ్చిందన్నారు. అనధి కార మద్యం విక్రయాలు లేవని తేలిందన్నారు. క్వారీ లీజులపై తనిఖీలు చేపట్టామన్నారు. గాలి నాణ్యత పర్యవేక్షణ ప్రారంభించామన్నారు.



సండే స్పెషల్

తింటే.. తంటా

రూ.5 నుంచి అందుబాటులో ఆకట్టుకుంటున్న రుచికరమైన విషం పిల్లల ఎదుగుదలతో పాటు ప్రాణాలను హరిస్తోంది. ఆకర్షణీయమైన ప్యాకింగ్ పిల్లలను ఆకట్టుకుంటుండగా.. తక్కువ ధర కావడంతో పెద్దలు పెద్దగా పట్టించుకోవడం లేదు. చివరకు జంక్‌ఫుడ్ పిల్లల పాలిట విషాహారంగా మారుతోంది. వారి ఎదుగు దలపై ప్రభావంతో పాటు రకరకాల ఆరోగ్య సమస్యలకు కారణంగా మారుతోంది. నిషేధిత రసాయనాలతో తయారు చేస్తున్న జంక్‌ఫుడ్‌లను యథేచ్ఛగా విక్రయిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. వీటి కొనుగోళ్లను నియం త్రించాల్సిన పెద్దలు వాటినే చిరుతిళ్లుగా అందిస్తూ.. పిల్లల ఆరోగ్యాల్ని హరిస్తున్నారు. కోరి మరీ.. కొనుగోలు చేసి.. భావి భారతాన్ని అనారోగ్యం పాలు చేస్తుండటంలో అటు వ్యవస్థ లు.. ఇటు తల్లిదండ్రులు కీలక పాత్రదారులుగా మారుతున్నారు.

రుచికరమైన విషం జంక్‌ఫుడ్

- ఆరోగ్యంపై ప్రభావం చూపుతోన్న చిరుతిళ్లు
- అరికట్టకపోతే చిన్నారుల్లో రక్తహీనత, ఊబకాయం

గుంటూరు (తూర్పు), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జంక్‌ఫుడ్.. రుచికరమైన విషం. ఇది పిల్లల ప్రాణాలను హరిస్తోంది. పిల్లలు పాఠశాలకు వెళ్లినప్పుడు.. సెలవుల్లో ఇళ్ల వద్ద ఏమి కొని తింటున్నారనే విషయం పట్టించుకోని పెద్దల నిర్లక్ష్యం వారి ఆరోగ్యాన్ని, భవితను చిదిమేస్తోంది. చిన్నారుల జీవితాల్ని శాసిస్తున్న చిరుతిళ్లు వారికి బలమివ్వకపోగా ప్రమాదంలోకి నెడుతున్నాయి. జంక్‌ఫుడ్ భారిన పడితే ఆ ప్రభావం చిన్నారులపై జీవితాంతం ఉంటుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. మద్యం చేసే నష్టం కంటే జంక్‌ఫుడ్ ఇంకా ఎక్కువ నష్టం చేస్తోంది. జం క్‌ఫుడ్ భారిన పడే వారి సంఖ్య రోజు రోజుకు అధికమవుతుంది. ఈ పరిస్థితుల్లో పిల్లల చదువుపై దృష్టి పెట్టినట్లుగానే వారు ఏమి తింటున్నారనే దాన్ని కూడా పరిశీలించాల్సిన బాధ్యత పెద్దలదే. పిల్లలకు జంక్‌ఫుడ్ కాకుండా ఫ్రూట్ సలాడ్‌లు, పల్లీలు, బెల్లం (మిగతా 8వ పేజీలో)

పొట్టలో పేరుకుపోతున్న వ్యర్థాలు

చిన్నపిల్లలు సరాసరిన రోజుకు 30 నుంచి 50 గ్రాముల వరకు జంక్ ఫుడ్, చాక్లెట్లను తింటున్నారని ఒక అంచనా. ఈ కారణంగా వారి పొట్టలో 30 గ్రాముల నుంచి 50 గ్రాముల వరకు వ్యర్థాలు ఉంటున్నాయి. ఫాస్ట్‌ఫుడ్‌లో వాడే మైదా, నూనెలతో విష, కొంకి, బద్దెపురుగులు, ఏలికపాములు వంటివి శరీరంలోకి చేరుతున్నాయి. ఇవి ఎముకల ఎదుగుదలపై ప్రభావం చూపుతుంటాయి. జంక్ ఫుడ్ వ్యర్థాలు దేహంలో పేరుకుపోవడంతో బాలికల్లో రక్తహీనత, బాలురులో ఊబకాయం పెరుగుతుంది. సరిగ్గా ఆహారం తినకపోయినా లావుగా కనిపిస్తుంటారు.

పౌష్టికాహారంతోనే.. రోగ నిరోధక శక్తి

గత పదేళ్లుగా పిల్లల ఆహారపు అలవాట్లు పూర్తిగా మారిపోయాయి. జంక్‌ఫుడ్ ప్లాస్టిక్‌తో సమానం. అది జీర్ణం కాక శరీరంలో పేరుకు పోతుంది. దాని వైపు నుంచి పిల్లల దృష్టి మరల్చాలి. పీచు, బల వర్ధక పోషకాలు అందించాలి. సంప్రదాయ ఆహారాన్ని తీసుకునేలా పిల్లల్ని ప్రోత్సహించాలి. పండ్లు, ఇతర ఆహార పదార్థాలతో భిన్న వంటకాలను తయారు చేసి అందించాలి.



\- భువన, డైటీషియన్, గుంటూరు



మిర్చి యార్డు ఫ్లైవోవర్ పూర్తి చేయాలి

శంకర్‌విలాస్ ఆర్వోబీతో సమానంగా పనులు ● కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని ఆదేశాలు

గుంటూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నల్లపాడు రోడ్డులో మిర్చియార్డు వద్ద నిర్మిస్తోన్న ఫ్లైవోవర్ బ్రిడ్జి పనులను త్వరగా పూర్తి చేయాలని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఆదేశించారు. శనివారం ఆయన పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవితో కలిసి ఫ్లైవోవర్ ఏర్పాటు చేసే ప్రాంతాన్ని పరిశీలించారు. 2023లో రూ.30 కోట్లతో ఫ్లైవోవర్ మంజూరు కాగా కనీసం ప్రాథమిక పనులు కూడా ప్రారంభం కాలేదన్నారు. శంకర్ విలాస్ వంతెన పనులతో సమానంగా ఈ వంతెన కూడా త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చా రు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వంతెన ఏర్పాటుకు సంబంధించిన పనులు నత్తనడకన జరుగుతున్నాయన్నారు. గత పాలకుల అశ్రద్ధ వల్ల పనులు ఆలస్యం అయ్యాయని ఆరోపించారు. యార్డుకు వచ్చే వాహనాలు, ట్రాఫిక్ సమస్యల దృష్ట్యా బ్రిడ్జి నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్ర మంలో నగరపాలకసంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, డీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు ఛానల్ భూసేకరణకు సహకరించాలి

గుంటూరు ఛానల్ పొడిగింపు ప్రాజెక్టు భూసేకరణను త్వరగా పూర్తి చేసేందుకు అందరూ సహకరించాలని డాక్టర్ పెమ్మసాని తెలిపారు. గుంటూరు ఛానల్ విస్తరణపై ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులుతో కలిసి కలెక్టరేట్‌లో పెమ్మసాని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు, ఎమ్మెల్యే, అధికారులు సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాలన్నారు. గత టీడీపీ హయాంలో ఛానల్ విస్తరణకు కేటాయించిన బడ్జెట్లో పనులు చేపట్టాలని కాంట్రాక్టర్లను కోరామన్నారు. నల్లమడ డ్రెయిన్ ఆధునికీకరణ పనులకు రాబోయే బడ్జెట్లో నిధులు మంజూరు చేయించే ప్రయత్నం చేస్తామన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గుంటూరు ఛానల్ విస్తరణ పనులను వేగవంతం చేయిస్తున్నామన్నారు. సమావేశంలో కలెక్టర్ నాగలక్ష్మి, ఇరిగేషన్ అధికారులు, డీఆర్వో పాల్గొన్నారు.


నల్లపాడు రోడ్డులో యార్డు వద్ద అధికారులతో మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని, ఎమ్మెల్యే మాధవి

దారి దోపిడీ కేసులో నిందితుల అరెస్టు

నరసరావుపేట లీగల్, సెప్టెంబరు 6 (ఆంధ్ర జ్యోతి): గత నెల 31 రాత్రి మాచర్ల ప్రాంతంలో జరిగిన దారి దోపిడీ కేసుకు సం బంధించి 9 మంది నిందితులను అరెస్టు చేసి నట్లు ఎస్పీ కంచి శ్రీనివాసరావు తెలిపారు. నిందితుల నుంచి రెండు కార్లు, మూడు కత్తులు, రూ.5 లక్షలు స్వాధీనం చేసుకున్నామన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నిందితుల వివరాలను ఎస్పీ ప్రక టించారు. గుంటూరు చంద్రమౌళినగర్‌కు చెందిన మహి మ క్రాంతి మంగళగిరికి చెందిన లక్ష్మీశ్రీనివాస ట్రేడర్స్‌లో పని చేసేవాడు. యజమాని నుంచి నగదు దోచుకోవాలని భార్య, మరి కొందరితో కలిసి పథకం రూపొందించాడు. ఈ క్రమంలో ముత్తూట్ ఫైనాన్స్‌లో తాకట్టు పెట్టిన బంగారం విడిపించాలని క్రాంతి భార్య రాధిక చేత యజమానికి ఫోన్ చేయించాడు. దీంతో యజమాని ఏ.మహేష్‌బాబు అనే వ్యక్తి కి నగదు ఇచ్చి గత నెల 31 రాత్రి పంపారు. దీంతో మహేష్‌బాబు మాచర్ల నుంచి సాగర్ వెళ్లే రోడ్లో ఫైఓవర్ బ్రిడ్జ్ వద్దకు రప్పించిన క్రాంతి ముఠా అతడి నుంచి 5 లక్షల నగదు తీసుకుని పారిపోయింది. దీంతో జరిగిన ఘటనపై అప్పటికప్పుడే మహేష్‌బాబు మాచర్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురజాల డీఎస్పీ జగదీష్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం పొందుగల, గుంటూరులో నిందితులను గుర్తించి శనివారం అరెస్టు చేసింది. నిందితుల్లో మంగళగిరిలోని దీనదయాళ్‌నగర్‌కు చెందిన కర్నే రాము, గుంటూరులోని పి.మహిమ క్రాంతి, ఎం ప్రసీన్‌బాబు, వల్లూరి సాయిరాం, పి.రాధిక, నాగరాజు, ఎస్ వెంకట శివరా మకృష్ణ, కే లక్ష్మీబాబు, ఏ లీల నాగ లోకేశ్ ఉన్నారు. వీరిలో ఆరుగురిపై గతంలో పలు కేసులున్నట్లు ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో గురజాల డీఎస్పీ జగదీష్, సీఐ ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

తాగునీరు కలుషితం

ప్రమాదంలో ప్రజారోగ్యం ● ఎస్ఎస్ ట్యాంక్‌లో చేపలు మృతి

పొన్నూరు టౌన్(చేబ్రోలు), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలం వడ్లమూడి గురువుపాలెం గ్రామంలో వంద ఎకరాల విస్తీర్ణంలో సమ్మర్ ట్యాంక్ ఉంది. ఇక్కడి నుంచి చేబ్రోలు, పొన్నూరు మండలాల్లోని పలు గ్రామాలతో పాటు గుంటూరు నగరవాసులకు తాగునీరు సరఫరా అవుతుంది. నిర్వహణా లోపంతో కలుషిత నీటికి ఈ ఎస్ఎస్ ట్యాంకు నిలయంగా మారింది. చేబ్రోలు మండలంలోని శలపాడు, గురువుపాలెం, పెదకాకాని మండలంలో తక్కెళ్లపాడు, తంగెళ్లమూడి గ్రామాలతో పాటు బుడంపాడు మీదగా గుంటూరుకి పైప్‌లైన్ ద్వారా తాగునీరు సరఫరా అవుతుంది. నిత్యం లక్షలాది లీటర్ల నీటిని సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నుంచి పంప్ హౌస్‌కు సరఫరా చేసి అక్కడ నుంచి ఫిల్టర్ చేసి క్లోరినేషన్ చేసి నీటిని పలు ప్రాంతాలకు సరఫరా చేస్తారు. అయితే సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్వహణపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో ట్యాంకులో ఎక్కడ చూసినా మృతి చెందిన చేపలు దర్శనమిస్తున్నాయి. ఆ చేపలను తొలగించకపోవడంతో చెరువులోని నీరు దుర్గంధభరితంగా మారుతుంది. అయినా ఇక్కడి సిబ్బంది పట్టించుకోవడంలేదు. కలుషిత నీటిని ఫిల్టర్ చేసి ప్రజలకు సరఫరా చేస్తున్నారు. అంతేకాకుండా ట్యాంకు చుట్టూ రక్షణ చర్యలు లేవు. దీంతో మందుబాబులు రాత్రివేళ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.


గరువుపాలెం ఎస్ఎస్ ట్యాంకులో మృతి చెందిన చేపలు

అందుబాటులో 2726 మెట్రిక్ టన్నుల యూరియా

జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు


యూరియా నిల్వలను పరిశీలిస్తున్న ఏడీ మోహన్‌రావు

గుంటూరు సిటీ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు యూరియా నిల్వలు పుష్కలంగా ఉన్నాయని జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు శనివారం తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో 2726 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. ఈ నెల 10 నాటికి మరో 1850 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులోకి వస్తుందన్నారు. సెప్టెంబరు చివరికి జిల్లాలో 22,000 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేయాల్సి ఉందన్నారు. అయితే ఇప్పటికే 21,800 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు అందజేశామని తెలిపారు. ఎరువుల కోసం ఎవరైనా ఇబ్బంది పెడితే స్థానిక వ్యవసాయ అధికారిని సంప్రదించాలన్నారు. కృత్రిమ కొరత సృష్టించినా, అధిక ధరలకు విక్రయించినా వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పత్రికా రంగంలో రాణించాలనుకునే యువకులకు
గొప్ప అవకాశం
మీరు చేయవలసిందల్లా
మంచి వాక్చాతుర్యము, కృషి, పట్టుదల, ఆసక్తి, ఉత్సాహము, ఓర్పు నేర్పులతో ఎదుటి వారిని మెప్పించి ఒప్పించి ఆంధ్రజ్యోతి దినపత్రికకు అడ్వర్‌టైజ్‌మెంట్స్ సేకరించడమే.



అడ్వర్‌టైజ్‌మెంట్ ఆఫీసర్
విద్యార్హత : Degree/ MBA * Males Only
వయసు : 25-30
జీతం : అర్హత, అనుభవం ఆధారంగా ఆకర్షణీయమైన జీతభత్యములు.
అనుభవం : పత్రికా రంగం/ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ మార్కెటింగ్ రంగంలో అనుభవం గల వారికిప్రాధాన్యత

యాడ్ రిప్రజంటేటివ్స్
విద్యార్హత : Degree * Males Only
వయసు : 25-30
జీతం : అర్హత, అనుభవం ఆధారంగా ఆకర్షణీయమైన జీతభత్యములు.
అనుభవం : పత్రికా రంగం/ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ మార్కెటింగ్ రంగంలో అనుభవం గల వారికిప్రాధాన్యత

తెలుగులో చక్కగా మాట్లాడటం, చదవటంతో పాటు ఇంగ్లీషు భాష పై అవగాహన ఉండాలి.
పనిచేయవలసిన కేంద్రాలు : గుంటూరు సిటీ, బాపట్ల, రేపల్లె
ఆసక్తి కలవారు పూర్తి వివరములతో కూడిన బయోడేటాను bm.gnt@andhrajyothy.com కు మెయిల్ పంపవచ్చును. లేదా ఈ దిగువ అడ్రస్‌లో ది. 8-9-2025 న సంప్రదించవచ్చు.
ఆంధ్రజ్యోతి 4/1 బ్రాడీపేట, రఘుమాన్షన్, 2వ అంతస్థు, గుంటూరు

దసరా నుంచి ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణ

● ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

గుంటూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విజయ దశమి నుంచి ఉమ్మడి గుంటూరు జిల్లా యువతకు ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ శనివారం ప్రకటించారు. ఈ నైపుణ్యాభివృద్ధి శిక్షణా తరగతులపై ఆదివారం గుంటూరు ఎన్జీవో హోమ్‌లో అవగాహనా సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. దసరా నుంచి లక్ష్మీపురంలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు పక్కనున్న తన కార్యాలయంలో ఈ శిక్షణ ఉంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వ శాఖల్లో ఏప్రిల్ నుంచి డిసెంబరు వరకూ నోటిఫికేషన్లు వస్తుంటాయని, యూపీఎస్సీ, ఏపీపీఎస్సీలపై పెట్టినంత దృష్టి ఎస్ఎస్‌సీ, ఆర్ఆర్‌బీ, ఎస్‌బీఐ పరీక్షలపై అభ్యర్థులు పెట్టడం లేదని అన్నారు. అలాంటివారికి ఈ శిక్షణ ఉపయోగపడుతుందని చెప్పారు. సెప్టెంబరు 8 నుంచి అభ్యర్థుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టి, ఈ నెల 28న ఆన్‌లైన్లో ప్రవేశపరీక్ష జరిపి, ఉత్తీర్ణులైనవారికి కోచింగ్ ఇస్తామని తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్సీలు అశోక్‌బాబు, ఏఎస్ రామకృష్ణ, విజయసాధన కిశోర్, ఎన్నారై ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తిలక్, కోచింగ్ ఇచ్చే అధ్యాపకులు పాల్గొంటారని ఆలపాటి తెలిపారు.

లాంఫాం కేవీకేకు జాతీయస్థాయి గుర్తింపు : యుగంధర్‌కుమార్



ప్రశంసాపత్రం అందుకుంటున్న లాంఫాం కేవీకే అధిపతి యుగంధర్‌కుమార్


లాంఫాం(తాడికొండ) సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): లాంఫాంలోని కృషి విజ్ఞాన కేంద్రాని (కేవీకే)కి జాతీయస్థాయిలో గుర్తింపు దక్కిందని దాని అధిపతి డాక్టర్ ఎం.యుగంధర్‌కుమార్ శనివారం తెలిపారు. తమిళనాడులోని వెల్లూరులో దక్షణాది రాష్ట్రాల కేవీకే వార్షిక జోనల్ వర్క్‌షాపును నిర్వహించారని చెప్పారు. గ్రామీణ యువత, విస్తరణా సిబ్బందికి నిర్వహించిన శిక్షణా కార్యక్రమాల విభాగంలో జాతీయ స్థాయిలో లాంఫాం కేవీకేకు గుర్తింపు లభించడంతో ప్రశంసాపత్రాన్ని అందించారని యుగంధర్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఐసీఏఆర్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల నుంచి వీసీలు, విస్తరణ సంచాలకులు, కేవీకేల సమన్వయకర్తలు, శాస్త్రవేత్తలు, అధికారులు పాల్గొన్నారు.

అదనపు, అనధికార పొగాకు ఉత్పత్తిపై సర్వీసు ఛార్జీల విధింపు

● కేంద్ర ప్రభుత్వ జాయింట్ సెక్రటరి కేసంగ్ వై షెర్పా

గుంటూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): 2024-25 పంట సీజన్‌కు సంబంధించి కొన్ని షరతులతో అదనంగా సాగు చేసిన, అనధికారికంగా ఉత్పత్తి జరిగిన ఎఫ్‌సీవీ (ఫ్లూ క్యూర్డ్ వర్జీనియా) పొగాకుని రిజిష్టర్డ్ ట్రేడర్లు, డీలర్లు కొనుగోళ్లు జరిపేందుకు అనుమతిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకొన్నది. ప్రధానంగా పంట సీజన్‌లో ప్రతీ రిజిష్టర్డ్ ఉత్పత్తిదారుడు తనకు అనుమతించిన దాని కంటే అదనంగా పండించిన పొగాకులో 10 శాతం కోటాని ఒక శాతం సాధారణ సర్వీసు ఛార్జీని పొగాకు బోర్డు ఫండ్‌కు చెల్లించి విక్రయించుకొనేలా అవకాశం కల్పించింది. అదనంగా 10 శాతం నుంచి 20 శాతం లోపు పొగాకు పండించిన రైతులు కేజీకి రూపాయి, 2 శాతం సర్వీసు ఛార్జీని చెల్లించాల్సి ఉంటుంది. అదనంగా 20 శాతం కంటే మించి పొగాకు పంటని పండించినట్లు అయితే కేజీకి రూపాయి, మూడు శాతం సర్వీసు ఛార్జీని చెల్లించాలి. ఇది సాధారణంగా రైతులు చెల్లించే ఒక శాతం సర్వీసు ఛార్జీకి అదనంగా ఉంటుంది. అనధికార రైతులు కేజీకి రూపాయి, ఐదు శాతం సర్వీసు ఛార్జీని చెల్లించి వేలం కేంద్రాల్లో పొగాకుని విక్రయించుకోవచ్చని కేంద్ర ప్రభుత్వ జాయింట్ సెక్రటరి కేసంగ్ వై షెర్పా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రకాశం బ్యారేజి నుంచి 43,500 క్యూసెక్కుల నీటి విడుదల



తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 6 (ఆంధ్ర జ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి స్వల్పంగా పెరిగింది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టుతో పాటు కీసర, మున్నేరు, వెలగలేరు, తదితర ప్రధాన వాగుల నుంచి శనివారం ఇన్‌ఫ్లోగా 62,347 క్యూసె క్కుల వరదనీరు బ్యారేజీకి వచ్చి చేరినట్లు ఇరిగేషన్ జేఈ రాజేశ్ తెలిపారు. బ్యారేజి రిజ ర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం నమోద వుతుండగా దిగువకు 43,500 క్యూసె క్కుల నీటిని విడుదల చేసినట్లు చెప్పారు. తూర్పు డెల్టా కాలువకు 10,433 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 8,216 క్యూసెక్కులు, గుంటూరు చానల్‌కు 198 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు జేఈ రాజేశ్ తెలిపారు.

స్వచ్ఛ వాతావరణమే... భావితరాలకు ఊపిరి

జిల్లా పర్యావరణ ఇంజనీరు నజీనాబేగం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న పర్యావరణ ఇంజనీరు నజీనా బేగం

గుంటూరు (తూర్పు), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛమైన గాలిని భావితరాలకు అందించేందుకు నేటి తరం కృషి చేయాలని జిల్లా పర్యావరణ ఇంజనీరు నజీనా బేగం అన్నారు. స్థానిక ఏటి అగ్రహారం, ఎస్కేబీఎమ్ హైస్కూల్ ప్రాంగణంలో కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో శనివారం ఇంటర్నేషనల్ డే ఆఫ్ క్లీన్ ఎయిర్ ఫర్ బ్లూస్కైస్-2025 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నజీనా బేగం మాట్లాడుతూ, గాలి కాలుష్యంతో ఊపిరి సంబంధిత వ్యాధులు తలెత్తుతున్నాయని, ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి ప్రమాదాల నుంచి విముక్తి పొందాలంటే విరివిగా మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలన్నారు. వాతావరణ సమతుల్యాన్ని కాపాడి రానున్న తరాలకు మంచి పర్యావరణాన్ని అందించాలని నజీనాబేగం కోరారు. అనంతరం స్వచ్ఛగాలి-నీలి ఆకాశాల కోసం అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నగరపాలక సంస్థ ఆరోగ్య అధికారి రామారావు హజరై పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్ ఖాజావలీ అధ్యక్షత వహించారు.

బ్రహ్మదేవాలయం అనువంశక ధర్మకర్తగా రాజావాసిరెడ్డి ప్రమాణం


ధర్మకర్తగా ప్రమాణస్వీకారం చేస్తున్న రాజావాసిరెడ్డి సుధాస్వరూప్

చేబ్రోలు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారతదేశంలోనే ప్రసిద్ధి గాంచిన శ్రీ చతుర్ముఖ బ్రహ్మలింగేశ్వర స్వామి ఆలయం అనువంశిక ధర్మకర్తగా శనివారం రాజావాసిరెడ్డి సుధాస్వరూప్ బహదూర్ మన్నే సుల్తాన్ దొర ప్రమాణం చేశారు. 18వ శతాబ్దంలో రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు చేబ్రోలులోని కోనేరు మధ్యలో శ్రీ చతుర్ముఖ బ్రహ్మదేవాలయాన్ని నిర్మించారు. ఈ ఆలయానికి తూర్పు పడమరన శివాలయాలు, ఉత్తర దక్షిణాన విష్ణు దేవాలయాలు, నాలుగు మూలలా అమ్మవారి ఆలయాలు ఉన్నాయి. చతుర్ముఖ బ్రహ్మదేవాలయానికి రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడి వారసులే అనువంశక ధర్మకర్తలుగా ఉండాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో శనివారం దేవాదాయ ధర్మాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శారదా దేవి రాజా వాసిరెడ్డి సుధాస్వరూప్‌తో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ఈవో వినయ్‌కృష్ణ పాల్గొన్నారు.

నేటి మధ్యాహ్నం నుంచి అమరేశ్వర ఆలయం మూసివేత

అమరావతి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సోమవారం ఉదయం 8 గంటల వరకు అమరేశ్వర ఆలయాన్ని మూసివేస్తున్నట్లు దేవస్థాన సహాయ కమీషనర్ రేఖ తెలిపారు. సోమవారం 8 గంటల తర్వాత ఆలయ సంప్రోక్షణ చేసిన తర్వాత భక్తులకు స్వామివారి దర్శనం కల్పిస్తామని ఆమె చెప్పారు.

9 నుంచి బీఈడీ కోర్సులకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ

ఏఎన్‌యూ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా బీఈడీ కోర్సుల్లో ప్రవేశానికి సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈ నెల 9వ తేదీ నుంచి ప్రారంభమై 12న ముగుస్తుందని ఏపీ ఎడ్‌సెట్ అడ్మిషన్స్ కన్వీనర్ ప్రొ. ఏవీఎస్ స్వామి తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకునే ఓసీ, బీసీ అభ్యర్థులు రూ.1200, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్ కేటగిరీల అభ్యర్థులు రూ.600 చెల్లించాలని చెప్పారు. అభ్యర్థులు తమ విద్యార్హతలకు సంబంధించిన ధ్రువపత్రాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని అన్నారు. ధ్రువపత్రాల పరిశీలన ఈ నెల 10 నుంచి 13వ తేదీ వరకు జరుగుతుందని, అనంతరం 13 నుంచి 15వ తేదీ మధ్య అభ్యర్థులు వెబ్ ఆప్షన్స్‌ను నమోదు చేసుకోవచ్చని తెలిపారు. 16వ తేదీన వెబ్ ఆప్షన్స్ మార్పులకు అవకాశమిస్తామని చెప్పారు. అనంతరం ఈ నెల 18న సీట్ల కేటాయింపు జరుగుతుందని, అభ్యర్థులు 19, 20వ తేదీల్లో తమకు కేటాయించిన కళాశాలల్లో రిపోర్టు చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఎన్‌సీసీ/సీఏపీ, ఇతర స్పెషల్ కేటగిరీల అభ్యర్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో ఈ నెల 12న ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో హాజరుకావాలని చెప్పారు.

కిట్స్‌కు వర్సిటీ స్థాయిలో మూడు అవార్డులు

● కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీ బాబు


జేఎన్‌టీయూ వీసీ నుంచి అవార్డులను అందుకుంటున్న కిట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీ బాబు

వట్టిచెరుకూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వింజనంపాడులోని కి ట్స్ కళాశాలకు యూనివర్సిటీ స్థా యిలో మూడు విభాగాల్లో గు ర్తింపు దక్కిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీ బాబు వెల్లడిం చారు. యూనివర్సిటీ స్థాయిలో కిట్స్ కళాశాలకు బెస్ట్ స్టార్ ఆఫ్ కంపెనీస్ రిజిస్ట్రేషన్ అండ్ బెస్ట్ ఆఫ్ పేటెంట్స్ గ్రాం టే గుర్తింపు దక్కిందని ఆయన తెలిపారు. జేఎన్‌టీయూ కాకినాడ 18వ వార్షికో త్సవంలో వీసీ సీఎస్ఆర్‌కే ప్రసాద్ చేతుల మీదుగా ఈ మూడు బహుమ తులను అందుకున్నట్లు చెప్పారు. బెస్ట్ స్టార్ ఆఫ్ కంపెనీస్ రిజిస్ట్రేషన్, బెస్ట్ పేటెంట్స్ గ్రాంటేకి మూడు అవార్డులతో పాటు ఎస్‌బీఏ ఎలిజబుల్ బ్రాంచెస్‌కు అక్రిడిటేషన్ పొందినట్లు తెలిపారు. కిట్స్ కళాశాల తొలి నుంచి విద్యతో పాటు విద్యార్థుల నైపుణ్యాలను అభివృద్ధి పరుస్తోందని, వారు నూతన ఆవిష్కరణలు చేసేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని చెప్పారు. దానికి ఈ గుర్తింపు నిదర్శన మని డాక్టర్ పీ బాబు పేర్కొన్నారు.

బాపట్లలో గంటసేపు నిలిచిన శబరి ఎక్స్‌ప్రెస్

బాపట్ల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక లోపం కారణంగా శబరి ఎక్స్‌ప్రెస్ బాపట్లలో గంటసేపు నిలిచిపోయింది. శనివారం రాత్రి 7 గంటలకు బాపట్ల రైల్వేస్టేషన్‌కు చేరిన శబరిఎక్స్‌ప్రెస్ రైలులో సాంకేతిక లోపం తలెత్తింది. దాంతో రైలును అక్కడే నిలిపేశారు. లోపాలు సరిచేసి 8 గంటలకు రైలును పంపించారు. దీంతో రైలులోని ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.

స్టాక్ ట్రేడింగ్ పేరుతో ఉపాధ్యాయుడికి ఎర

● రూ. 64.50 లక్షలు దోచుకున్న సైబర్ కేటుగాళ్లు

సత్తెనపల్లి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్టాక్ ట్రేడింగ్‌లో అధిక లాభాలు వస్తాయని ఆశ చూపించి సత్తెనపల్లిలో ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడి నుంచి సైబర్ కేటుగాళ్లు రూ. 64.50 లక్షలను దోచుకున్నారు. సత్తెనపల్లి పట్టణంలోని రఘురామ్‌నగర్‌లో నివాసముంటున్న ప్రభుత్వ ఉపాధ్యా యుడు కట్టిబోయిన కోటేశ్వరరావు ఫోన్‌కు ఈ ఏడాది మార్చి 10వ తేదీన వాట్సాప్ గ్రూపు నుంచి ఒక లింకు వచ్చింది. ఆ లింకును కోటేశ్వరరావు ఓపెన్ చేయగా స్టాక్ మార్కెట్ నిమిత్తం డౌన్‌లోడ్ చేసుకోవాలని, స్టాక్ ట్రేడింగ్ చేసిన చాలా మందికి మంచి లాభాలు వచ్చాయని సైబర్ నేరగాళ్ళు ఆయన్ను గ్రూపులో పెట్టారు. లాభాలు వస్తాయన్న ఉద్దేశంతో కోటేశ్వరరావు జూలై 25 నుంచి 29వ తేదీ వరకు సైబర్ నేరగాళ్లు చెప్పిన విధంగా తన ఖాతా నుంచి పలు విడతలుగా రూ.65.50 లక్షలను వారి ఖాతాలకు మళ్లించారు. ఆ తరువాత నగదు రిఫండ్ కోసం కోటేశ్వరరావు వారికి మెసేజ్ పెట్టగా వాట్సాప్ గ్రూపులో విత్‌డ్రాకు ట్యాక్స్ కట్టాలని సమాచారమిచ్చారు. దాంతో అను మానం వచ్చి కోటేశ్వరరావు వారి కార్యాలయం చిరునామా అడగ్గా ముంబైలో ఉందని చెప్పారు. వారు చెప్పిన కార్యాలయం చిరునామా గురించి కోటేశ్వరరావు వాకబు చేయగా అది నకిలీదని తేలింది. దాంతో తాను మోసపోయానని గ్రహించి శనివారం పట్టణ పోలీసు స్టేషన్‌లో కోటేశ్వరరావు ఫిర్యాదు చేశారు. తన భార్య ఖాతా నుంచి కూడా నగదును సైబర్ నేరగాళ్ళు చెప్పిన నెంబ రుకు పంపానని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. కోటేశ్వరరావు ఫిర్యాదు మేరకు పట్టణ సీఐ నాగమల్లేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ సందర్భంగా సీఐ నాగమ ల్లేశ్వరరావు మాట్లాడుతూ, సైబర్ నేరగాళ్ళ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ నేరగాళ్ళు ఆన్‌లైన్‌లో ప్లే స్టోర్ ద్వారా షేర్ మార్కెట్ ట్రేడింగ్ యాప్ లాంటి లింకులు పంపి మోసాలకు పాల్పడుతున్నారని ప్రజలు దాన్ని గ్రహించి జాగ్రత్తగా ఉండాలని ఆయన హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


గణేశ్వర్ రెడ్డి(ఫైల్)

చేబ్రోలు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా మరో మహిళకు గాయాలైన ఘటన చేబ్రోలు మండలం గరువుపాలెం సమీపంలో జరిగింది. బాపట్ల జిల్లా చుండూరు మండలం వలివేరు గ్రామానికి చెందిన ఆరుమళ్ళ గణేశ్వర్ రెడ్డి (58) కుటుంబంతో కొన్నేళ్లుగా తెనాలి మండలం సంగం జాగర్లమూడిలో నివాసం ఉంటున్నారు. గణేశ్వర్ రెడ్డి వడ్లమూడిలోనే ఓ సంస్థలో పనిచేస్తున్నారు. శనివారం ఆయన సంగంజాగర్లమూడి నుంచి వడ్లమూడికి ఆటోలో వస్తుండగా గరువుపాలెం వద్ద నారాకోడూరు నుంచి నిమ్మకాయల లోడుతో తెనాలి వెళుతున్న ట్రాలీ వాహనం వీరు ప్రయాణిస్తున్న ఆటోను ఢీకొంది. గణేశ్వర్ రెడ్డి అక్కడికక్కడే మృతిచెందగా మరో మహిళ గాయపడింది. ఆమెను చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడు గణేశ్వర్ రెడ్డి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వీరనారాయణ వెల్లడించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.45 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	125, 134, 145
చికెన్ విత్ స్కిన్(కిలో)	236.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	246.00



ఆంధ్రజ్యోతి సండే క్లాసిఫైడ్స్ SUNDAY CLASSIFIEDS

ఉద్యోగావకాశాలు

➡ బజాజ్ ఫైనాన్స్ నందు పనిచేయుటకు కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ మరియు మేనేజర్ కావలెను. Q: 10th To డిగ్రీ, Cibil complusory సంప్ర॥ 9390710372 AJG-248643

➡ తెనాలి చెంచుపేట శ్రీ వెంకటేశ్వర hp గ్యాస్ ఏజెన్సీ నందు ఆఫీసులో పని చేయుటకు కంప్యూటర్ నాలెడ్జి కలిగిన లేడీస్ / జెంట్స్ కావలెను. సెల్ : 7032908705 AJG-239686

➡ HDFC లైఫ్ కంపెనీ కొరకు పనిచేయుటకు అడ్వైజర్స్ కావలెను కమీషన్ + ఇన్‌సెంటివ్స్ + గిఫ్ట్స్ + టూర్స్ & Promotions, Age no bar, సంప్రదించండి : 9985666606. AJG-248860

➡ బియ్యం షాపు నందు పని చేయుటకు గుమాస్తా కావలెను. వయస్సు : 30 సం॥లోపు యువకులు కావలెను. అడ్రస్ : వెంకట సీతా వరలక్ష్మి ట్రేడర్స్, స్టాల్ గర్ల్స్ హైస్కూల్ ఎదురు, నగరంపాలెం, గుంటూరు. జీతం: 14000/- AJG-248644

➡ Wanted 1) Technical Engineer : Graduate in Instrument Engineering Having 2 Years Experience in Granite Factory and Maintains The Machines 2) Supervisers Intermeidate / Gruduate having 3 years Experience in Any granite cutting or Polishing Industry 3) Data Entry Operator : Graduate with 2 years Experience in any industry 4) Accounts Assistant : B.Com with 3 years Experience in any Industry / Organization in Reputed granite Facotry located at Vemavaram (V) Ballikurava (Mandal) Bapatla Dist., Ph : 99898 93429 AJB-2069

పోయినవి

➡ I, Mahesh Thanneeru, S/o Chenna Kesavulu Thanneeru, resident of Door No: 4-42, Alugurajupalli, Macherla, Palnadu District, Andhra Pradesh - 522426. I have lost my original Passport bearing No. X8342676 while travelling from Macherla Xerox Shop to Alugurajupalli. If found, kindly contact me at 85199 56869. AJB-209497

మ్యారేజ్ లింక్స్

➡ వెద్దెర, వడ్డీలు కులములో మొదటి వివాహం, రెండవ వివాహం వధూవరులకు పరిచయ వేదిక, సెప్టెంబర్ 21వ తేది ఆదివారం విజయవాడలో ఉదయం 8:30 నుండి మధ్యాహ్నం 2.30 వరకు, సంప్ర॥ 8712889055 AJO-211496

అమ్మకము

➡ కోటి గ్రానైట్స్ - క్లియరెన్స్ సేల్ ! బల్క్ స్టాక్ క్లియరెన్స్ కారణంగా గ్రానైట్ స్లాబులపై ప్రత్యేక రాయితీలు ! సాయిబాబా రోడ్, కొరిటెపాడు, గుంటూరు. సంప్ర॥ 94402 49796 AJG-239634

రియల్ ఎస్టేట్

➡ గుంటూరు సిటీ, గోరంట్ల, లాం, అగతవరప్పాడు, రెడ్డిపాలెం, వెనిగండ్ల, పెదకాకాని, నంబూరు, కంతేరు, కాజా మరెక్కడైనా ప్లాట్లు అ/కొ సంప్ర॥ జనచైతన్య ప్లాట్లు మా ప్రత్యేకత. Ph: 73823 96677. SAAA-940

➡ గుంటూరు నగరంలోని 3rd ఫేజ్, గొల్లపూడి to చెన్నై హైవే 200 అడుగుల (మాస్టర్ ప్లాన్) రోడ్ దగ్గరలో పుష్కలమైన మంచి నీటిని గుంటూరు నగర వాసులకు అందిస్తున్న అతి మెరుగైన ప్రాంతంలో 25 ఎకరాల మెగా C.R.D.A ప్లాట్స్, అపార్ట్‌మెంట్స్, విల్లాస్ కొరకు సంప్ర॥ శ్రీ సాయి రియల్ ఎస్టేట్ & కన్సల్టెన్సీ, చంద్రమౌళినగర్, 7/2, NTR స్టేడియం దగ్గర, గుంటూరు. సెల్ : 98490 38672, 81869 46260. AJG-239409

➡ శ్రీ సాయి రియల్ ఎస్టేట్ & కన్సల్టెన్సీ, గుంటూరు రాజధాని ప్రాంతాల్లో ఇల్లు, స్థలాలు, పొలాలు, అపార్ట్‌మెంట్స్, కమర్షియల్ స్థలాలు బిల్డింగ్స్ కొను॥ అమ్ము॥ మరియు లోన్స్ కొరకు సంప్ర॥ చంద్రమౌళినగర్, 7/2, ఎన్టీఆర్ స్టేడియం మెయిన్ గేటు ఎదురు రోడ్డు, సెల్ : 98490 38672, 81869 46260. AJG-239412

వ్యవసాయ భూమి అమ్మకం

➡ బాపట్ల జిల్లా మేదరమెట్ల దగ్గర, దైవాల రావూరు గ్రామంలో 7 ఎకరాల వ్యవసాయ భూమి అమ్మకానికి కలదు. సంప్ర: 9032582481 / 9908862323 AJH-16076

PLOT FOR SALE

➡ చ॥ గజం 10,999/- మాత్రమే APCRDA అప్రూవ్ వెంచర్ నందు ఓపెన్ ప్లాట్స్ అమ్మకమునకు కలవు. గుంటూరు-Hyd హైవే ప్రక్కన, 70% బ్యాంకు లోన్ సౌకర్యం కలదు. సంప్ర॥ 96522 46386. AAA-10091

అద్దెకు

➡ తెనాలి కొత్తపేటలో నూతనంగా నిర్మిస్తున్న కమర్షియల్ బిల్డింగ్‌లో కొన్ని అంతస్తులు (వ్యాపార సంస్థలకు) అద్దెకి ఇవ్వబడును. సంప్ర॥ 8331055295 AJG-248907

➡ అంకమ్మనగర్ మెయిన్‌రోడ్ SP గారి బంగ్లా ఎదురు వెంకటలక్ష్మి నిలయం 3వ ఫ్లోర్‌లో 24 గం॥ మంచి నీటితో అన్ని వసతులతో ఫ్యామిలీలకు, బ్యాచిలర్స్‌కు తక్కువ ధరకు అద్దెకు గలదు. ఫోన్ : 99591 25860. RK-698

కమర్షియల్

➡ గుంటూరు : 4/7 బ్రాడీపేట "స్వరాజ్ ప్లాజా" బిల్డింగ్ నందు 1వ ఫ్లోర్‌లో 1285 Sft. స్పేస్ కమర్షియల్ పర్పస్‌కు అద్దెకు ఇవ్వబడును. సెల్లార్ పార్కింగ్ & మున్సిపల్ వాటర్ కలదు. Ph: 9177970111. AJG-248838

➡ నూతన భవనము 3 అంతస్తులు, ప్రతి అంతస్తు 4400 చ.అ.లు. బ్యాంకులు, కార్యాలయాలకు అనువైనది. 100 అడుగుల రోడ్డు కామినేని హాస్పటల్ సమీపంలో కానూరు - విజయవాడ సంప్రదించండి. 63018 05709 AJB-236009

కమర్షియల్ స్పేస్ అద్దెకు

➡ తెనాలి నెహ్రూ రోడ్డు రజకపేట దగ్గర Dr. Khan's సిటీ స్కాన్ & డయాగ్నస్టిక్స్ బిల్డింగ్ ఫస్ట్ ఫ్లోర్‌లోని 2300 Sq.ft మెయిన్ రోడ్‌లోని కమర్షియల్ బిల్డింగ్ అద్దెకు ఇవ్వబడును. హాస్పిటల్స్ / బ్యాంక్స్ / డెంటల్ ఆర్ స్పెషాలిటీ క్లినిక్ / కార్పొరేట్ లేదా ఆఫీస్ / కన్సల్టింగ్ ఫార్మ్స్ / ట్రైనింగ్ సెంటర్‌లకు అనువైనది, ప్రైమ్ మెడికల్ & కమర్షియల్ హబ్, Ample పార్కింగ్ స్పేస్, లిఫ్ట్ & జనరేటర్ సౌకర్యం కలదు. వివరములకు సంప్రదించండి సెల్ నెం : 9885626267, 9848170673 AJG-239690

సర్వీసెస్

డెంటల్

➡ బృందావన్ డెంటల్ కేర్ లక్ష్మీపురం నుండి రాజేంద్రనగర్ 1వ లైన్, గొట్టిపాటి కళ్యాణ మండపం ఎదురుగా శ్రీ కృష్ణ రెసిడెన్సీ #103 కు మార్చబడినది. కావున గమనించగలరు. సెల్ : 9985113333. AJG-248829

బోర్ వెల్స్

➡ విజయ బోర్ వెల్స్ : 4-1/2, 6-1/2; 7' & 8' అంగుళం బోర్లు & క్లీనింగ్ సరసమైన ధరలకు వేయబడును. గుంటూరు. సంప్ర॥ 98662 22717, 98481 83887. AAA-10272

బిల్డింగ్ డిమాలిష్

➡ పాత బిల్డింగ్స్, పెంకుటిళ్ళు, రేకుల షెడ్లు, పగల కొట్టబడును మరియు పాత కలప, ఐరన్ రేకులు, సిమెంట్ రేకులు కొనబడును. ఫోన్ : 98494 81424, 80746 77449. AJG-248842

లీకేజీ సమస్యలా?

➡ బాత్ రూమ్ లీకేజి గోడలపై చెమ్మ, స్లాబ్ లీక్, స్లాబ్ క్రాక్, వాటర్ ట్యాంకర్ లీక్, సంప్స్ లీక్, వాల్‌క్రాక్స్ ఎటువంటి లీకేజిలైనా 100% గ్యారంటీతో కెమికలింగ్ చేయగలము. సంప్ర॥ 9642458892 AJG-248614

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనల కొరకు
ఈ క్రింది నెంబరును సంప్రదించగలరు
99854 03281
సమయం : ఉ॥ 10:00 గం॥ల నుండి సా॥ 06:00 గం॥ల వరకు (సోమవారం నుండి శనివారం వరకు)

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

సదా మీ సేవలో
అచిరకాలంలోనే అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతి కి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా!
ఈ ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి చెబితే చాలు మా సిబ్బంది తక్షణం మీకు పత్రిక అందే ఏర్పాటు చేస్తారు. అంతేకాదు. పత్రిక పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా ఫోన్ చేసి చెప్పవచ్చు. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా ఉంటారు

గుంటూరు 1 టౌన్	97036 18725
గుంటూరు 2 టౌన్	99854 01056
తెనాలి	99854 11202
నరసరావుపేట	99854 11206
బాపట్ల	99663 35084
పిడుగురాళ్ళ	93909 05725
మంగళగిరి	93986 73618
అమరావతి	95027 86195
పొన్నూరు	97042 99094
రేపల్లె	99854 12254
చిలకలూరిపేట	91103 23914
వినుకొండ	99662 50266
మాచర్ల	88861 19952
సత్తెనపల్లి	97048 67908
ప్రత్తిపాడు	63004 34285

సర్క్యులేషన్ మేనేజర్ : 99854 11214
ఇట్లు : బ్రాంచ్ మేనేజర్

SHRIRAM Finance శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్
ఆఫీస్ చిరునామా : 29-37-141, 2వ ఫ్లోర్, రామ మంధిరం దగ్గర, ఏలూరు రోడ్డు, విజయవాడ - 520002

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క 8 (6) రూలు క్రింద 30 రోజులు అయిన తర్వాత అమ్మకాన్ని తెలుపుతూ ఋణగ్రహీతకు ఇవ్వబడిన ఉద్దేశిత అమ్మకం ప్రకటన

ఋణగ్రహీతలు/హామీదారుల వివరములు : **1. అక్షర ఎడ్యుకేషనల్ సొసైటీ, ప్రాతినిధ్యం వహిస్తున్న కరెస్పాండెంట్ : అనిల్ కుమార్ కాకర్ల,** తండ్రి : బంగారు నాయుడు, డి.నెం.9-1/2, ధనేకుల కళ్యాణ మండపం ప్రక్కన, పటమట, విజయవాడ, ఎన్‌టిఆర్ జిల్లా - 520010. **2. కాకర్ల దామోదర్ నాయుడు,** తండ్రి : బంగారు నాయుడు, డి.నెం.1-44, కమ్మ కండ్రిగ, రామచంద్రాపురం, చిత్తూరు జిల్లా - 517561. **3. కాకర్ల శారద,** భర్త : అనిల్ కుమార్, డి.నెం. 401, తార టవర్, ఎన్‌సిబి నాయుడు కాలనీ, బెంజి సర్కిల్ దగ్గర, వెంకటేశ్వరపురం, విజయవాడ టౌన్, ఎన్‌టిఆర్ జిల్లా - 520010. **4. ఎమ్. నారాయణ రావు,** తండ్రి : వెంకటేశ్వరరావు, భాగ్యనగర్, ఒంగోలు టౌన్ & జిల్లా - 523001. **5. అభిషేక్ చౌదరి కాకర్ల,** తండ్రి : కె. అనిల్ కుమార్, డి.నెం.401, తార టవర్స్, ఎన్‌సిబి నాయుడు కాలనీ, బెంజి సర్కిల్ దగ్గర, పటమట, వెంకటేశ్వరపురం, విజయవాడ టౌన్, ఎన్‌టిఆర్ జిల్లా - 520010. **6. ఆకాష్ కాకర్ల,** తండ్రి : కె. అనిల్ కుమార్, డి.నెం.401, తార టవర్స్, ఎన్‌సిబి నాయుడు కాలనీ, బెంజి సర్కిల్ దగ్గర, పటమట, వెంకటేశ్వరపురం, విజయవాడ టౌన్, ఎన్‌టిఆర్ జిల్లా - 520010. **7. కాకర్ల రోజా,** భర్త : కాకర్ల దామోదర్ నాయుడు, డి.నెం.1-44, కమ్మ కండ్రిగ, రామచంద్రాపురం, చిత్తూరు జిల్లా - 517561. **8. పి. శ్రీనివాసరావు,** తండ్రి : పి. అంజనేయులు, డి.నెం.74-31-16, రఘు గార్డెన్ వీధి, అశోక్ నగర్, విజయవాడ, ఎన్‌టిఆర్ జిల్లా -520007.

సర్/మేడమ్,

విషయం : 2002 సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలుతో చదువుకొనేలా 2002 సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం ద్వారా ఋణదాతకు బకాయిపడిన మొత్తాలను వసూలు చేయుటకు ఋణగ్రస్తులగు : **శ్రీమతి కాకర్ల శారద, భర్త : కాకర్ల అనిల్ కుమార్ కు** చెందిన ఆస్తుల అమ్మకం గురించి నిర్దేశించిన అమ్మకం ప్రకటన.

సూచిక : ఋణ ఒప్పంద నెం. **VIJA9TF2001240002.**

ఇందుమూలముగా తెలియజేయడమేమనగా "శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్" ఎన్‌సిఎల్‌టి చెన్నై వారి ఉత్తర్వు ప్రకారం "శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్" తో విలీనం కాబడింది. ఇటీవల "శ్రీరామ్ ఫైనాన్స్ ట్రాన్స్‌పోర్ట్ లిమిటెడ్" గా మార్పు చెందింది. ఇది తేది.30-11-2022 నుంచి పేరు మార్పుకు సంబంధించిన సర్టిఫికేట్ ఆఫ్ ఇన్ కార్పొరేషన్ తేది.30-11-2022 ద్వారా మార్పు చెందింది. దీని రిజిష్టర్డు కార్యాలయం : శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, దక్షిణ దిశ, ఇండస్ట్రియల్ ఎస్టేటు, గిండీ, చెన్నై - 600032 మరియు మన కార్యాలయం ఉన్న చోటు : శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, డోర్ నెం.29-37-141, 2వ అంతస్తు, రామ మందిరం దగ్గర, ఏలూరు రోడ్డు, విజయవాడ - 520002 మరియు విజయవాడ-2లో బ్రాంచి కార్యాలయం గలదు. (ఇక నుంచి కంపెనీగా/ ఋణదాతగా పిలవబడేది).

సెక్యూర్డ్ ఋణదాత - శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారు సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 లోని సెక్షన్ 13(2) క్రింది **తేది.27.01.2023**న జారీ చేసిన డిమాండ్ నోటీసుతో పేర్కొన్న **తేది.27.01.2023** నాటికి బకాయి మొత్తం **రూ.1,05,01,917/-** (అక్షరాల ఒక కోటి ఐదు లక్షల ఒక వేయి తొమ్మిది వందల పదిహేడు రూపాయలు మాత్రమే) తో పాటు ఇటీవల వడ్డీ/ఖర్చులు మొత్తాన్ని నిర్దేశించిన కాలపరిమితిలోగా మీరు చెల్లించవలెను. మీరు సదరు నోటీసులో నిర్దేశించిన కాలపరిమితిలోగా బకాయి మొత్తాన్ని చెల్లించనందున అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారు 2002 సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలులోని నిబంధన 8తో చదువుకొనేలా చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద సెక్యూర్డ్ స్థిరాస్తులను **తేది.28.04.2023**న లాంఛనంగా స్వాధీనం చేసుకొనిరి. మరియు చట్టంలోని సెక్షన్ 14 క్రింద ఎగ్జిక్యూటివ్ సహకారంతో **తేది.24.05.2025**న భౌతిక స్వాధీనం కూడా చేసుకొనిరి.

సెక్యూర్డ్ ఆస్తి స్వాధీనం చేసుకున్నప్పటికీ, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారికి మీరు బకాయి మొత్తాన్ని చెల్లించలేదు. అందువల్ల దిగువ వివరించిన ఆస్తిని బహిరంగ ఇ-వేలం ద్వారా ఈ నోటీసు ప్రచురించిన తేది ఈ నోటీసు చేరిన తేదీ నుంచి గల 30 రోజుల తర్వాత, విడిగా ఇ-వేలం అమ్మకం నోటీసు ఇచ్చి అమ్మవల్సిన అవసరం ఏర్పడింది. ఇ-వేలం జరిగే తేది మరియు సమయంతో పాటు ఆస్తి రిజర్వు ధర మరియు ఇ-వేలం నిర్వహించనున్న సర్వీసు ఏర్పాటుదారుని వివరాలను విడిగా మీకు తెలుపబడును.

అందువల్ల మీరు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారికి బకాయిపడ్డ మొత్తంతో పాటు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారికి అయిన ఖర్చులను మరియు అయిన ఇటీవల వడ్డీ, ఖర్చులు, ఛార్జీల మొత్తాన్ని అమ్మకం ప్రకటన ప్రచురణ తేదీకి ముందుగా చెల్లించినచో, ఆస్తి అమ్మకంపై ఏలాంటి తదుపరి చర్యలు తీసుకోబడవు మరియు మీరు చట్టంలోని సెక్షన్ 13(8) క్రింద నిర్దేశించిన ప్రకారం మీ ఆస్తిని మీరు విడిపించుకొనవచ్చును.

ఆస్తి షెడ్యూలు : శ్రీమతి కాకర్ల శారద, భర్త : కాకర్ల అనిల్ కుమార్ గారికి చెందినది
గుంటూరు జిల్లా, మంగళగిరి సబ్ డిస్ట్రిక్ట్, తాడేపల్లి మండలం, కుంచనపల్లి గ్రామ పంచాయితీ ఏరియా, కుంచనపల్లి గ్రామం, సర్వే నెం.111/6 మరియు తదుపరి సబ్ డివిజన్ ప్రకారం సర్వే నెం.111/6ఎ లోని ఎ.0.39 సెంట్లు లేదా 0.159 హెక్టార్లు లేదా 1887.6 చ॥గ॥ల విస్తీర్ణం గల వ్యవసాయేతర భూమికి హద్దులు: **తూర్పు** : డొంక, **దక్షిణం** : డొంక, **పడమర**: కందకం, **ఉత్తరం** : తల్లపనేని స్వాతి మరియు వీరమాచినేని విజయలక్ష్మి గార్ల భూమి.
పైన తెలిపిన హద్దులలోని విస్తీర్ణం ఎ.0.39 సెంట్లు లేదా 0.159 హెక్టార్లు లేదా 1887.6 చ॥గ॥ల విస్తీర్ణం గల వ్యవసాయేతర భూమి మాత్రమే. (ఈ ఆస్తి ఇబ్రహీంపట్నం ఎస్ఆర్ఓ యొక్క డాక్యుమెంట్ నెం.4495/2017 ప్రకారం కలదు).

ప్రదేశం : విజయవాడ
తేది : 06-09-2025
అధీకృత అధికారి
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

స్త్రీశక్తి పథకానికి అపూర్వ స్పందన : ఎమ్మెల్యే మాధవి



'స్త్రీశక్తి' సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 'స్త్రీశక్తి' పథకా నికి ప్రజల్లో అపూర్వ స్పందన వస్తోందని ఎమ్మెల్యే గళ్లా మాధవి చెప్పారు. గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం ఆమె అధ్యక్షతన 'సూపర్ సిక్స్- సూపర్‌హిట్- స్త్రీశక్తి' సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ సోమవారం సాయంత్రం ఏటుకూరు రోడ్డులోని వివాహ కన్వెన్షన్ హాల్లో 'స్త్రీశక్తి' సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆగస్టు 15న ప్రారంభమైన స్త్రీశక్తి పథకం మహిళల్లో భరోసా, స్వావ లంబన కల్పిస్తోందని చెప్పారు. స్త్రీ శక్తితో సహా ప్రజాశక్తిని కూడా కలిపి గుంటూరును అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్తామని ఎమ్మెల్యే మాధవి చెప్పారు. సమావేశంలో మహిళలు నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గురువులను గౌరవించాలి : రాయపాటి మమత



పురస్కారాలు పొందిన ఉపాధ్యాయులతో డాక్టర్ రాయపాటి మమత, షేక్ సజీలా తదితరులు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): విద్య, విజ్ఞానం, వివేకం నేర్పి జీవిత భవనానికి పునాదులు వేస్తున్న గురువులను ప్రతి ఒక్కరూ గౌర వించాలని రమేష్ హాస్పిటల్స్ డైరక్టర్ రాయపాటి మమత అన్నారు. స్థానిక అడవి తక్కెళ్లపాడులో శనివారం రాఘవ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అక్షర శిల్పం పేరుతో అత్యుత్తమ ఉపాధ్యాయులకు అవార్డుల కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ ఉన్నత శిఖరాలకు చేరుకున్న ప్రతి ఒక్కరి వెనుక గురువు ఉన్నారని తెలిపారు. డిప్యూటీ మేయర్ షేక్ సజీలా మాట్లాడుతూ ఒత్తిడి లేని విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులకు పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో రాఘవ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మాడభూషి రవికుమార్, రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు ఆదర్శ్ అధ్యక్షురాలు మన్నె అనురాధ, టాప్ కిడ్స్ డైరెక్టర్ థామస్ సెబాస్టియన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీవారి దర్శనం నిలిపివేత



ఆలయ మహద్వారానికి తాళాలు వేస్తున్న అర్చకులు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 6 (ఆంధ్ర జ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వర స్వామివారి దేవాలయంలో ఆదివారం చంద్రగ్రహణం సందర్భంగా స్వామివారి దర్శనం నిలిపివేస్తున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం నుంచి సోమవారం ఉదయం 9 గంటల వరకు మూసి వేస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. సోమవారం ఉదయం సంప్రోక్షణానంతరం భక్తుల దర్శనానికి అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు.

అమెరికా సుంకాల దాడిని వ్యతిరేకించాలి

● వామపక్ష పార్టీల నాయకులు



నిరసన తెలుపుతున్న వామపక్ష పార్టీల నాయకులు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): భారత్‌పై అమెరికా చేస్తున్న సుంకాల దాడిని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని వామపక్ష పార్టీల నాయకులు పేర్కొన్నారు. భారతీయ సరుకులపై పన్నులను 50శాతానికి పెంచిన ట్రంప్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ శనివారం స్థానిక హిమని సెంటర్లో గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జంగాల అజయ్‌కుమార్, దండా లక్ష్మీనారాయణ, పాటిబండ్ల కోటేశ్వరరావు, ఆకిటి అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వీర క్షత్రియులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

● రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మిశెట్టి శ్రీనివాసరావు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రెండు తెలుగు రాష్ట్రాల్లో 13 లక్షల పైగా జనాభా కలిగిన తొగట వీర క్షత్రియులకు ప్రత్యేక ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆదుకోవాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మిశెట్టి శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో శనివారం రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ చైర్మన్ కొనగళ్ళ నారాయణకు తొగట వీర క్షత్రియ సేవా సంఘం ఆధ్వర్యంలో అన్ని జిల్లాల నుంచి నాయకులు హాజరై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ ఏర్పాటుపై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళతామని నారాయణ హామీ ఇచ్చినట్టు ఆయన తెలిపారు.

సీపీఎస్, జీపీఎస్‌లను రద్దు చేయాలి

● ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చాంద్ బాషా



సమావేశంలో మాట్లాడుతున్న చాంద్‌బాషా, పాల్గొన్న ఉద్యోగులు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): రానున్న అసెంబ్లీ సమా వేశాల్లో సీపీఎస్, జీపీఎస్ రద్దు బిల్లును ప్రవేశపెట్టాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సయ్యద్ చాంద్ బాషా డిమాండ్ చేశారు. స్థానిక అంకమ్మనగర్ సంఘ కార్యాలయంలో శనివారం జరిగిన జిల్లా కార్యవర్గ సమా వేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు గుదిబండగా మారిన సీపీఎస్ రద్దు చేయాలని కోరితే గత ప్రభుత్వం జీపీఎస్ విధానాన్ని తీసుకువచ్చి మరొక గుదిబండను మెడకు కట్టారని ఆరోపించారు. గతంలో మాదిరిగా ఉన్న ఓపీఎస్‌ను ప్రవేశపెట్టాలని కోరారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, నాగేశ్వరరావు, కోటేశ్వరరావు, పెదరత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆర్థికాభివృద్ధికి బ్యాంకర్లు సహకరించాలి

● డీసీసీ, డీఎల్‌ఆర్‌సీ సమావేశంలో కేంద్ర మంత్రి పెమ్మసాని



బ్యాంకర్ల కమిటీ సమావేశంలో పాల్గొన్న కేంద్ర మంత్రి పెమ్మ సాని, ఎమ్మెల్యేలు, అధికారులు

గుంటూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కౌలు రైతులకు పంట రుణాలతో పాటు, పేదల ఆర్థికాభివృద్ధికి స్వయం ఉపాధి, పరిశ్రమల ఏర్పాటుకు బ్యాంకర్లు సహకరించాలి. ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా బ్యాంకు లింకేజీ రుణాల మంజూరుకు బ్యాంకర్లు చిత్తశుద్ధితో పనిచేయాలని కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని శంకరన్ సమావేశమందిరంలో బ్యాంకర్ల జిల్లా సంప్రదింపుల కమిటీ(డీసీసీ), జిల్లా స్థాయి సమీక్ష కమిటీ(డీఎల్‌ఆర్‌సీ) సమావేశం జరిగింది. ప్రాధాన్య రంగాలైన వ్యవసాయశాఖకు సంబంధించి స్వల్పకాలిక రుణాలు, కౌలు రైతులకు పంట రుణాలు, అనుబంధ శాఖలకు సంబంధించి పశుపోషణకు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు రుణాలు, విద్యా, హౌసింగ్ రుణాలు, విశ్వకర్మ, పీఎం సూర్యఘర్ తదితర పథ కాలకు నిర్దేశించిన లక్ష్యాలు, వాటిలో పూర్తి చేసినవి, లక్ష్యాలను పూర్తి చేయలేకపోవటానికి గల కారణాలు, వాటి పరిష్కార మార్గాలపై బ్యాంకులు, పథకాల వారీగా డాక్టర్ పెమ్మ సాని సమీక్షించి సూచనలు అందించారు. జిల్లా వార్షిక రుణ ప్రణాళికను విడుదల చేశా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పబ్లిక్, ప్రైవేటు రంగం బ్యాంకులు సామాజిక బాధ్యతగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం ప్రవేశపెట్టిన పథకాలకు నిర్దేశించిన లక్ష్యాల మేరకు ఖచ్చితంగా రుణాలు మంజూరు చేయాలన్నారు. ప్రస్తుతం వ్యవసాయం చేస్తున్నది కౌలు రైతులే అని భూయజమానులకు కాకుండా కౌలు రైతులకే బ్యాంకర్లు పంట రుణాలు మంజూరు చేయాలన్నారు. జిల్లా క్రెడిట్ యాక్షన్ ప్లాన్‌పై ప్రతి మూడు నెలలకు ఒకసారి బ్యాంకులు, పథకాల వారీగా సూక్ష్మ స్థాయిలో సమీక్షిస్తారన్నారు. బ్యాంకులు నిర్దేశించిన లక్ష్యాలను తప్పనిసరిగా అధిగమించాలన్నారు. కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ సీసీఆర్‌సీ కార్డులు జారీ చేసిన వారికి పంట రుణాలు బ్యాంకర్లు ఖచ్చితంగా మంజూరు చేయాలన్నారు. ఈ సమావేశంలో తాడికొండ, ప్రత్తి పాడు, గుంటూరు తూర్పు, పశ్చిమ ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్‌కుమార్, బూర్ల రామాంజ నేయులు, గళ్లా మాధవి, నసీర్ అహ్మద్‌లు ప్రసంగించారు. యూనియన్ బ్యాంక్ డీజీఎం జవహర్, డీఆర్వో ఎస్ఎస్‌కే ఖాజావలి, లీడ్ బ్యాంక్ మేనేజరు మహిపాల్ రెడ్డి, ఇండియన్ బ్యాంకు డీజీఎం గౌరీశంకర్, ఆర్బీఐ ఎల్డీవో గిరిధర్, నాబార్డు డీడీఎం శరత్ బాబు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి నాగేశ్వరరావు, జిల్లా ఉద్యానశాఖ అధికారి రవీందర్ బాబు, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజరు జయలక్ష్మి పాల్గొన్నారు.

వైభవంగా వాసవీ యూత్ గణనాథుడి నిమజ్జన ఊరేగింపు

● హాజరైన కేంద్ర మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యే నసీర్ తదితరులు

● కళాకారుల ప్రదర్శనలతో కోలాహలంగా ఊరేగింపు



గణేశుడి సన్నిధిలో కేంద్ర మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యే నసీర్, ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ

గుంటూరు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): వాసవీ యూత్ ఆధ్వర్యంలో ఏటుకూరు రోడ్డులోని శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయం ఎదుట జరుగుతున్న 27వ వినాయక చవితి మహోత్సవాల్లో భాగంగా గణనాథుడి నిమజ్జన ఊరేగింపు మహోత్సవం శనివారం వైభ వంగా జరిగింది. కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, తూర్పు ఎమ్మెల్యే ఎండీ నసీర్ అహ్మద్‌లు హాజరై నిమజ్జన ఊరేగింపు మహోత్సవాన్ని ప్రారంభించారు. మంగళ వాయిద్యాలు, కేరళ వాయిద్యాలు, తీన్మార్ డప్పు వాయిద్యాలు దేవతామూర్తుల వేషధార ణలో, కోలాటాలతో అంగరంగ వైభవంగా ప్రదర్శనలు నిర్వహించారు. కన్యకా పరమేశ్వరి ఆలయం నుంచి లాలాపేట మీదుగా హిమనీ సెంటర్ మీదుగా అమరావతి కృష్ణా జలా ల్లో నిమజ్జన కార్యక్రమం జరిగింది. స్వామి నిమజ్జన ఊరేగింపు మహోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చారు. కార్యక్రమాలను ఉత్సవ కమిటీ అధ్య క్షులు తూనుగుంట్ల నాగేశ్వరరావు, కార్యదర్శి పువ్వాడ నాగ వెంకటనారాయణ, కోశాధికారి కాజా శ్యామ్ సుందర్, ప్రోగ్రాం కమిటీ చైర్మన్ అన్నా రామ్‌ప్రసాద్ తదితరులు పర్య వేక్షించారు.

● పరమాయికుంటలో జనసేనసాగర్ యూత్ ఆధ్వర్యంలో గణేశ్ విగ్రహం వద్ద పెమ్మసాని, నసీర్ పూజలు నిర్వహించారు. ఇన్నర్ రింగ్ రోడ్డులోని 99 అడుగుల గణేశ్ విగ్రహాన్ని ఎమ్మెల్యే నసీర్ దర్శించుకున్నారు.

మన్నవ మోహనకృష్ణ యూత్ ఆధ్వర్యంలో అన్నదానం

గుంటూరు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): పశ్చిమ నియోజకవర్గంలో మన్నవ మోహన కృష్ణ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక చవితి మహోత్సవాల్లో భాగంగా శనివారం అన్నదానం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, గుంటూరు జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్‌కుమార్, పశ్చిమ, తూర్పు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు గళ్ళా మాధవి, నసీర్, ఏపీఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్, డీసీఎం ఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబు, టీడీపీ నాయకులు మన్నెం నాగమలేశ్వరరావు తదితర లు పాల్గొన్నారు. అనంతరం ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ భక్తులకు స్వయంగా అన్నప్రసాదాలు వడ్డించారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు సాయి మాధవ్, సాయి నాథ్, సంతోష్, చందు, అనంత్ పాల్గొన్నారు.



ఊరేగింపులో కళారూపాల ప్రదర్శన



కేరళ వాయిద్యాలు

వడ్డెరల అభ్యున్నతికి ప్రత్యేక కార్యాచరణ

● కార్పొరేషన్ చైర్మన్ మల్లె ఈశ్వరరావు



మాట్లాడుతున్న మల్లె ఈశ్వరరావు, పాల్గొన్న వడ్డెర సంఘ నాయకులు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): వడ్డెరల అభ్యున్నతి, సంక్షేమంపై ప్రత్యేక కార్యచరణ రూపొందిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ వడ్డెర సంక్షే మ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్లె ఈశ్వరరావు అన్నారు. గుంటూరు హౌసింగ్ బోర్డులో కార్పొరేషన్ కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమాశంలో ఆయన మాట్లాడారు. మంగళగిరిలో జయహో బీసీ సభలో చంద్ర బాబు నాయుడు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు. దీనిపై మంత్రి కొల్లు రవీంద్ర అధ్యక్షతన సచివాలయం లో ప్రత్యేక సమావేశం నిర్వహించినట్టు చెప్పారు. ఈ సందర్భంగా కార్పొరేష న్‌కు డైరెక్టర్లను నియమిస్తూ ప్రభుత్వ జీవోపై ఆయన హర్షం వ్యక్తం చేశారు.

వీనుల విందుగా సంగీత కచేరి

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీపురం శ్రీత్యా గరాజ సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో శ్రీత్యాగరాజ కళావేదికపై శనివారం విద్వాన్ వారణాసి శ్రీకృష్ణ రాఘవ, హైదరాబాద్ వయోలిన్ సోలో శాస్త్రీయ సంగీత కచేరి వీనుల విందుగా జరిగింది. వీరికి మృదంగంపై విద్వాన్ సీహెచ్ సూర్య, ఘటంపై విద్వాన్ ఏ.కౌండిన్య, హైదరాబాద్ వారు చక్కటి వాయిద్య సహకారాన్ని అందించారు. కృష్ణ రాఘవ కచేరీని నవరాగమాలిక వర్ణంతో ప్రారంభించి శ్రీత్యాగరాజ కీర్తనలతో పాటు అనేక వాగ్గేయకారుల కీర్తనలను వయోలిన్‌పై శ్రావ్యంగా ఆలపించి సంగీతాభిమానులను అలరించారు.

మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలో గురుపూజోత్సవం

గుంటూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ వెంగళరావునగర్ బాలికో న్నత పాఠశాలలో గురుపూజోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శనివారం ఉదయం ఎలిమెంటరీ స్కూల్ హెచ్‌ఎం పీ రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ దినోత్సవ విశిష్టతను హైస్కూలు హెచ్‌ఎం కే ప్రమీల, మోడల్ ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయిని గుర్రం లక్ష్మీదేవి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుల మీద గౌరవంతో గుర్రం శ్రీరాములు అమెరికా నుంచి వచ్చి ఈ పాఠశాల ను చూసి టీచర్స్ డే ఘనంగా జరగడానికి సహకరించారని ఉపాధ్యాయులు తెలిపారు. కొత్తగా వచ్చిన ముగ్గురు ఉపాధ్యాయులను సత్కరించారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా బ్రాడీపేట, అశోక్‌నగర్, కంకరగుంట గేట్ పరిసర ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ ఎస్.గురవయ్య తెలిపారు.

వ్యవసాయ ఉత్పత్తులపై పన్ను మినహాయింపు కల్పించాలి

● చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు

గుంటూరు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ ఉత్పత్తులను పన్నుల జాబితా నుంచి మినహాయింపు కల్పించాలని ది ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా అధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు తెలిపారు. జిన్నాటవర్ సెంటర్‌లోని చాంబర్ కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ ఉత్పత్తులతో పాటు వ్యవసాయ పనిముట్లకు కూడా పన్నుల మినహాయింపు కల్పిస్తే వ్యవసాయ రంగానికి ఊతమిచ్చినట్లవుతుందన్నారు. జడ్ఆర్‌యూసీసీ సభ్యుడిగా తాను ఈనెల 3న సెకింద్రాబాద్‌లో జరిగిన రైల్వేజోనల్ స్థాయి సమావేశంలో హాజరైనట్లు తెలిపారు. నడి కుడి - శ్రీకాళహస్తి రైల్వే లైను పనులను వెంటనే పూర్తి చేయాలని కోరినట్లు పేర్కొన్నా రు. అలానే శంకర్‌విలాస్ బ్రిడ్జి నిర్మాణం నేపథ్యంలో నల్లపాడు, పెదకాకాని, మంగళ గిరి రైల్వేస్టేషన్‌లలో కూడా రైళ్లకు స్టాపింగ్ ఏర్పాటు చేస్తే ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉంటుందని చెప్పినట్లు తెలిపారు. విలేకరుల సమావేశంలో చాంబర్ సభ్యుడు గార్లపాటి సత్యనారాయణ, ఆతుకూరి నగేష్‌కుమార్, కొప్పురావూరి బాబురావు తదితరులున్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆంజనేయులు తదితరులు

అంగన్‌వాడీ వర్కర్ల యూనియన్ నూతన కమిటీ ఎన్నిక

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక పాత గుంటూరు సీఐటీయూ కార్యాలయంలో శనివారం నగర మహాసభ, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) గుంటూరు ప్రాజెక్టు నూతన కమిటీ ఎన్నిక కార్యక్రమం జరిగింది. యూనియన్ గౌరవాధ్యక్షుడిగా కట్లగుంట శ్రీనివాసరావు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా పద్మావతి, అస్మత్ తారా, ఉపాధ్యక్షులుగా భాగ్యరేఖ, నాగేశ్వరి, సహాయ కార్యదర్శులుగా జె.రమ, శివలీల, రోజమ్మ, కోశాధికారిగా టి.రాధా, మరో ఆరుగురు కమిటీ సభ్యులతో నూతన కమిటీని ఎన్నుకున్నారు.



నూతనంగా ఎన్నికైన యూనియన్ సభ్యులు

ఆంధ్రజ్యోతి
దినపత్రికలో అన్ని రకముల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
సంప్రః 99854 11213 99854 11225 | 99854 01877 99854 04047 99854 01614

ప్రభుత్వ అనుమతితో వ్యాపారాలు నిర్వహించుకోవాలి

● కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు (కార్పొరేషన్), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నుంచి అనుమతు లు లేకుండా హోల్‌సేల్ వ్యాపారాలు నగరపాలక సంస్థ పరిధిలో నిర్వహించడానికి వీల్లేదని, అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటా మని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. శనివారం అనుమతి లేకుండా హోల్‌సేల్ వ్యాపారాలు చేస్తున్న వారితో, వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులతో కమిష నర్ క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్ డి.శ్రీనివాసరావు, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ ఎండీ నజీనా బేగం, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ ఏ.గాయత్రి, సీపీడీసీఎల్ ఈఈ శ్రీనివాసరావు, భూగర్భ జలశాఖ డీడీ డి.వందన, మార్కెటింగ్ ఏడీ సత్యనారాయణ చౌదరి తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

గుంటూరు నగరంలో జరుగు తున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, పనులు జరుగుతున్న సమ యంలో ఎమినిటి కార్యదర్శులు పర్యవేక్షించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్ప ష్టం చేశారు. శనివారం కమిషనర్ నగరంపాలెం దర్గా వెనుక రోడ్డులో సీసీ రోడ్డు నిర్మాణ పనులను, అమరావతి రోడ్డులో పారిశుధ్య పనులను, విద్యానగర్ ఎక్స్‌టెన్షన్‌లో ఆక్యుపెన్సీ కోసం దరఖాస్తు చేసుకున్న బహుళ అంతస్తు భవనాన్ని పరిశీలించి, సంబంధిత అధికా రులకు తగు ఆదేశాలు జారీ చేశారు. పర్యటనలో పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజా రోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందించాలి

● పౌర సంస్థల విజ్ఞప్తి

గుంటూరు (కార్పొరేషన్), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తురకపాలెంలో ప్రభుత్వ వైఫల్యాలు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా 3 నెలలుగా 40 మందికి పైగా మరణించారని, వారి కుటుంబాలకు రూ.10 లక్షల ఆర్థిక సాయం అందించాలని జనచైతన్య వేదిక, రేట్ పేయర్స్ అసోసియేషన్, అవగాహన, మానవత, నేస్తం, కోవిడ్ ఫైటర్స్, సర్వీస్ హెల్త్ ఆర్గ నైజేషన్, మాదిగ ఎడ్యుకేషన్ ట్రస్ట్ తదితర పౌర సంస్థల ప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పౌరసంస్థల ప్రతినిధులతో కూడిన నిజనిర్ధారణ కమిటీ శనివారం తురకపాలెం మృతుల కుటుంబాలను పరామర్శించి, మరణాలకు గల కారణాలు తెలుసుకొని, ఎస్సీకాలనీలోని ప్రజలకు అవగాహన కల్పించారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షు డు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కలుషిత నీటి సమస్యను పరిష్కరించి, స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని తురకపాలెంలో పెద్ద ఎత్తున భూగర్భ జలాలను తరలిస్తూ జరిగే నీటి వ్యాపారాన్ని వెంటనే అరికట్టాలని కోరారు. రేట్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఓరుగంటి నారాయణరెడ్డి, విశ్రాంత అడిషనల్ ఎస్పీ కొణతం వెంకట చలపతిరావు, నేస్తం సహ వ్యవస్థాపకులు, సామాజిక విశ్లేషకులు టి. ధనుంజయ రెడ్డి, మాదిగ ఎడ్యు కేషన్ ట్రస్ట్ చైర్మన్ ఏపీ పటేల్, అవగాహన నేత రావి వెంకటరత్నం, కోవిడ్ ఫైటర్స్ వ్యవస్థాపకులు అల్లాబక్ష, సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ టీసేవకుమార్, మానవత కార్యదర్శి కె.సతీష్ ప్రసంగించారు.

ఆపదలో ఉన్న కుటుంబాలను ఆదుకోవడం అభినందనీయం

● ఎక్సైజ్ శాఖ డీసీ శ్రీనివాసులు

గుంటూరు (కార్పొరేషన్), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న కుటుంబాలను మానవతా ధర్మంతో ఆదుకోవడం అభినందనీయమని గుంటూరు ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ కే శ్రీనివాసులు తెలిపారు. శనివారం గుంటూరు ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఎక్సైజ్ కానిస్టేబుల్స్ కే శ్రీనివాసనాయుడు, సీహెచ్ శ్రీనివాసరావు, కేసీహెచ్ కోటయ్య కుటుంబాలకు ఆర్థిక సాయాన్ని ఆయన చేతుల మీదు గా అందజేశారు. అసోసియేషన్ తరపున ఒక్కొక్క కుటుంబానికి రూ.96 వేల చొప్పున మూడు కుటుంబాలకు రూ.2.88 లక్షలు ఆర్థిక సాయం అందించడం ప్రశంసనీయమన్నా రు. కార్యక్రమంలో జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు మార్పు కోటయ్య, నాయకులు మైల శ్రీనివాసరావు, కొండలరావు, కోటేశ్వరరావు, రాజు పాల్గొన్నారు.



మృతుల కుటుంబాలకు చెక్కులు అందజేస్తున్న ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ కే శ్రీనివాసులు

ఎన్‌ఎఫ్‌ఐఆర్ వర్కింగ్ కమిటీ మెంబర్‌గా రమణయ్య




రమణయ్య

గుంటూరు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వేమెన్ (ఎన్ఎఫ్ఐఆర్) జాతీయ వర్కింగ్ కమిటీ సభ్యుడిగా దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ డివిజనల్ సెక్రెటరీ వీవీ రమణయ్య ఎన్నికయ్యారు. మూడు రోజులుగా న్యూఢిల్లీ లో జరుగుతున్న ఎన్ఎఫ్ఐఆర్ నేషనల్ కన్వెన్షన్‌లో జాతీయ వర్కింగ్ కమిటీ ఈ మేరకు నిర్ణయం తీసుకొన్నది. ఈ సందర్భంగా రమణయ్య మాట్లాడుతూ జాతీయ కమిటీలో సభ్యుడిగా ఉంటూ ఇక్కడి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

AISHWARYA
DENTAL CLINIC & IMPLANT CENTRE
అమూల్య టవర్స్, సాయిబాబా రోడ్ ప్రక్కన, యమ్‌జి హౌస్ ఎదురు, విద్యానగర్, గుంటూరు. ఫోన్ : 70755 65444
అన్ని రకాల దంత సమస్యలకు అధునాతనమైన కార్పొరేట్ వైద్య సదుపాయం అందుబాటులో
మా ప్రత్యేకతలు: అడ్వాన్స్ డెంటల్ ఎక్విప్‌మెంట్ సహాయంతో
* Full Mouth Rehabilitation
* Dental Implants
* Invisalign Aligners
* Smile Designing
* Root canal treatments
* Teeth whitening
* Laser Surgery



Dr. Aishwarya (MDS)
(Periodontist & Implant Surgeon)



KALYANI ADS
Timings : 9 AM - 9 PM (Monday- Saturday), 9 AM - 2 PM (Sunday).

ఆరోగ్యానికి భరోసా



- రాష్ట్రప్రభుత్వం తీసుకొచ్చిన యూనివర్సల్ హెల్త్ పాలసీతో రూ. 25 లక్షల వరకు బీమా వర్తింపు
- 3,257 వ్యాధులకు చికిత్స
- పేదలకు వరంగా తాజా పాలసీ

సత్తెనపల్లి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక స్థితిగతులతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికీ ఆరోగ్య బీమా దక్కనుంది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఎన్టీఆర్ వైద్య సేవా పథకం ద్వారా రూ 2.50 లక్షలు, కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ ద్వారా రూ.5 లక్షలు పేదల వైద్య ఖర్చులకు అందిస్తున్నాయి. ఒక్కో కుటుంబం ఒక ఏడాదికి వైద్య సేవలు తీసుకొనేందుకు ఈ పథకాలు అమల్లో ఉన్నాయి. ఇప్పుడు ఇంతకు మించి రాష్ట్రప్రభుత్వం ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ముందుకు వచ్చింది. ఇప్పటి వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న వైద్య సేవలన్నీ దారిద్రరేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు మాత్రమే అందేది. ఇది కూడా కొన్ని రకాల వ్యాధులకు మాత్రమే చికిత్సలు అందేవి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన పాలసీలో అన్ని రకాల చికిత్సలు ఉన్నాయి. వర్కింగ్ జర్నలిస్టులను ఇందులో చేర్చారు. అన్ని వర్గాలకు హెల్త్ పాలసీని వర్తింపజేస్తారు.

కార్పొరేట్ ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్ళలేక ప్రభుత్వాసుపత్రుల్లో వ్యాధి నయమవుతుందో లేదో నమ్మకం లేక చాలా మంది సతమతమవుతున్నారు. అయితే తాజాగా రాష్ట్రప్రభుత్వం తీసుకొచ్చిన యూనివర్సల్ హెల్త్ పాలసీతో ఇలాంటి వారి కష్టాలన్నీ తీరనున్నాయి. ఈ పాలసీతో పేద, మధ్య తరగతి ప్రజలు కార్పొరేట్ ఆస్పత్రి మెట్లెక్కేందుకు అవకాశం కలగనుంది. ప్రతి కుటుంబానికి రూ. 25 లక్షలు ఆరోగ్య బీమా వర్తించేలా గురువారం రాష్ట్ర క్యాబినెట్ ఆమోదించింది. ఈ సొమ్ముతో 3,257 చికిత్సలు ఉచితంగా పొందేదుకు అవకాశం కలుగుతుంది.

ఆరు గంటల్లోనే వర్తింపు

సాధారణ జ్వరంతో ఆస్పత్రికి వెళితే డాక్టర్ ఫీజు, మందులు, రక్త పరీక్షలతో కనీసం రూ.5వేలయినా ఖర్చవుతుంది. ఇక ఆపరేషన్‌లకయితే రూ.లక్షల్లో ఖర్చవుతుంది. ఆస్పత్రిలో ఉండేందుకు గదికి రూ 3.వేల నుంచి రూ 10వేల వరకు అద్దె వసూలు చేస్తున్నారు. కార్పొరేట్ వసతులున్న ఆస్పత్రుల్లో అయితే మరింత అధికంగా వసూలు చేస్తున్నారు. ఆరోగ్య పరీక్షలకు రూ. 5 వేల నుంచి రూ. 20 వేల వరకు ఖర్చవుతున్నాయి. వ్యాధి నిర్ధారణ తరువాతయ్యే ఖర్చు గురించి ఇక చెప్పలేం. కుటుంబానికి జీవనాధారమైన ఇంటి పెద్ద అర్థాంతరంగా మంచం పట్టడమో, ప్రాణాలు కోల్పోవటమో జరిగితే ఆ కుటుంబం వీధిన పడుతుంది. వైద్య ఖర్చులకే లక్షలాది రూపాయలు ఖర్చు చేయలేక పేద, మధ్య తరగతి ప్రజలు చితికిపోతున్నారు. ఇప్పుడు ప్రతి పది మందిలో ముగ్గురు షుగర్, బీపీ వ్యాధితో బాధపడుతున్నారు. రెండు వ్యాధులున్న వారు వివిధ రకాల పరీక్షలు చేయించుకోవాలి. లేదంటే పక్షవాతం, కిడ్నీ సంబంధిత వ్యాధుల భారిన పడుతున్నారు. గుండెపోటుకు గురవుతున్నారు. ప్రతి గ్రామంలో క్యాన్సర్ బాధితులు కూడా ఉన్నారు. వీటి చికిత్సకు లక్షల్లో ఖర్చవుతుంది. దీర్ఘకాలిక వ్యాదులు కావటంతో చికిత్సకు మందులు వాడాల్సి వస్తుంది. సంపాదించిన దానిలో సగం ఆస్పత్రులకు పోస్తున్నారు. ఈ పరిస్థితిని తప్పించేందుకు ప్రభుత్వం అందరూ ఆరోగ్యంగా ఉండేందుకు రూ. 25 లక్షల బీమాను వర్తింపజేస్తోంది. ఆస్పత్రిలో చేరిన అరు గంటల్లోపే హెల్త్ పాలసీ అమల్లోకి వచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. ఈ పాలసీ అమలు చేయటం ద్వారా ప్రజలందరికీ ఆరోగ్య భరోసా లభించనుంది.



న్యాయ శాస్త్రంలో బంగారం

అద్భుత ప్రతిభతో 9 బంగారు పతకాలు కైవసం చేసుకున్న తెనాలి యువకుడు శ్రీరామ్

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నుంచి స్వీకరణ



హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ చేతుల మీదుగా విశాఖలో బంగారు పతకాలను అందుకుంటున్న తెనాలి విద్యార్థి శ్రీరామ్

తెనాలి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): న్యాయ శాస్త్రంలో విశేష ప్రతిభ చూపి తెనాలికి చెందిన శ్రీరామ్ అనే యువకుడు 9 బంగారు పతకాలను సాధించి అరుదైన రికార్డు సృష్టించారు. ఆ పతకాలను రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ చేతుల మీదుగా ఆయన అందున్నారు. తెనాలికి చెందిన భాగవతుల నాగసాయి శ్రీరామ్ విశాఖపట్నంలోని దామోదరం సంజీవయ్య జాతీయ లా విశ్వవిద్యాలయంలో న్యాయశాస్త్ర విద్యను అభ్యసిస్తున్నారు. ఎల్ఎల్ఎంలో క్రిమినల్ అండ్ సెక్యూరిటీ విభాగంలో అత్యుత్తమ ప్రతిభ చూపి గోల్డ్ మెడల్ సాధించారు. దీంతోపాటే మరో 8 విభాగాల్లో ప్రతిభ చూపి మొత్తం 9 బంగారు పతకాలను దక్కించుకున్నారు. శుక్రవారం విశాఖలోని విశ్వవిద్యాయలంలో జరిగిన స్నాతకోత్సవంతో రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ చేతుల మీదుగా శ్రీరామ్ ఈ పతకాలను అందుకున్నారు. 9 పతకాలు ఒకేసారి సాధించి అరుదైన రికార్డు సాధించటంతో పలువురు ప్రముఖులు శ్రీరామ్‌ను అభినందించారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ శనివారం శ్రీరామ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. తల్లిదండ్రులు దుర్గాప్రసాద్, లలిత శారదకు ఆలపాటి అభినందనలు తెలిపారు. శ్రీ విఖనస శ్రీనివాస ట్రస్ట్ తరపున కిరణ్‌కుమార్, మూర్తి వెంకటేశ్వరరావు, తదితరులు శ్రీరామ్‌కు, ఆయన కుటుంబసభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

నిర్లక్ష్యమే.. శాపం

(5వ పేజీ తరువాయి)

ఏపీ చేపట్టిన దాఖలాలు లేవు.

జూలైలో 10 మంది మృతి

మరణాల్లో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారుల నిర్లక్ష్యం తేటతెల్లం అవుతుంది. ఈ ఏడాది జూలైలో తురకపాలెం గ్రామానికి చెందిన 10 మంది వరుసగా మరణించారు. వారిలో అన్ని వయసుల వారు ఉన్నారు. పొలంపల్లి వెంకటేశ్వర్లు(52) గుంటూరు ఫీవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. ఈ తర్వాత వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు మేల్కొన్నా కొన్ని ప్రాణాలు దక్కి ఉండేవి అన్న వాదన స్థానికంగా వినిపిస్తుంది. గ్రామానికి చెందిన మరణ నివేదిక ప్రతీ నెల చివరిలో ఆరోగ్య కార్యకర్తలు జిల్లా కార్యాలయానికి పంపుతారు. కేవలం 2300 మంది జనాభా ఉన్న చిన్న గ్రామంలో ఒకే నెలలో 10 మంది మరణిస్తే అక్కడ అసాధారణ పరిస్థితి ఉన్నట్లు భావించాలి. అయినా ఏ అధికారి కూడా ఈవిషయం పెద్దగా పట్టించుకున్న దాఖలాలు కనిపించలేదు.

ఆగస్టులోనూ మరణ మృదంగమే..

ప్రభుత్వ శాఖల నిర్లక్ష్యం తురకపాలేనికి శాపంగా మారినట్లు కనిపిస్తుంది. జూలైలో అధిక సంఖ్యలో మరణాలు సంభవించిన తర్వాత ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసి అందరికీ పరీక్షలు నిర్వహిస్తే పెను ప్రమాదం తప్పి ఉండేది. అటువంటి చర్యలు చేపట్టక పోవడంతో ఆగస్టులో కూడా గ్రామానికి చెందిన 10 మంది మరణించారు. సెప్టెంబరు నెల మరణాలకు సంబంధించిన వివరాలు అధికారులు ఇంకా బయటకు వెల్లడించలేదు.

ఫోన్ చేసినా పట్టించుకోలేదు..

తురకపాలెంలో వరుస మరణాలు సంభవిస్తున్న విషయాన్ని కొందరు ప్రజాప్రతినిధులు ఆరోగ్యశాఖ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినట్లు తెలుస్తుంది. జిల్లాకు చెందిన ముఖ్య ప్రజాప్రతినిధి కూడా ఫోన్‌లో పరిస్థితిని వివరించినట్లు సమాచారం. అయినా ముఖ్య అధికారులు పెద్దగా స్పందించలేదన్న ఆరోపణలున్నాయి. చివరికి అదే ప్రజాప్రతినిధులు విషయాన్ని రాష్ట్ర స్థాయి అధికారుల దృష్టికి తీసుకు వెళ్లడంతో జిల్లా అధికారుల్లో కదలిక వచ్చింది. సుమారు 29 మంది మరణించిన తర్వాత వైద్య, ఆరోగ్య శాఖ మేల్కొందన్న విమర్శలున్నాయి.

రక్తనమూనాలకు తెనాలిలో పరీక్షలు

తురకపాలెంలో 2500 మందికి సంబంధించిన రక్త నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహించేందుకు వైద్యఆరోగ్యశాఖ ఏర్పాట్లు చేసింది. ఈ క్రమంలో శనివారం వెయ్యి మంది నుంచి రక్తనమూనాలు సేకరించగా వాటిలో 189 మంది రక్త నమూనాలను తెనాలి జిల్లా వైద్యశాలకు పరీక్షల నిమిత్తం తరలించారు. కొన్నింటిని గుంటూరు సర్వజన ఆస్పత్రికి, మరికొన్ని నమూనాలను విజయవాడ ప్రభుత్వ వైద్యశాలకు పంపించారు. వీటిని పరీక్షించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉండటంతో శనివారం రాత్రి వరకు పరీక్షలు చేపట్టారు. ఇందుకోసం 8 మంది పాథాలజీ నిపుణులు, ఐదుగురు ల్యాబ్ టెక్నీషియన్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లను ప్రత్యేకంగా ఏర్పాటు చేసినట్లు వైద్య విధాన పరిషత్ జిల్లా అధికారి రంగారావు తెలిపారు. ఆదివారం కూడా మరికొన్ని నమూనాలు తెనాలి వైద్యశాలకు రానున్నాయన్నారు. ఒక్కొక్క రక్త నమూనా నుంచి కంప్లీట్ బ్లడ్ కౌంట్, జీవ రసాయన పరీక్ష, లివర్ ఫంక్షన్ టెస్టులు చేస్తున్నట్లు తెలిపారు. వీటి ద్వారా మరణాల గుట్టును గుర్తించే అవకాశం ఉందని తెలిపారు. పరీక్షల నిర్వహణను పర్యవేక్షిస్తున్నట్లు ప్రోగ్రాం ఆఫీసర్, ప్రత్యేక అధికారి డాక్టర్ మజీదా తెలిపారు.

తింటే.. తంటా

(5వ పేజీ తరువాయి)

చిక్కీలు, లడ్డూలు, రాగులు, జొన్నలు, సజ్జలుతో తయారుచేసే పదార్థాలు ఇవ్వాలని ఎఫ్ఎస్ఎస్ఏఐ ప్రత్యేకంగా సూచిస్తోంది. 14 ఏళ్ల లోపు పిల్లలకు ఇచ్చే ఆహారంలో కార్బోహైడ్రేట్లు ఉండాలి. ఉడికించిన ఆహార పదార్థాలు ఇవ్వాలి. పాలు, గుడ్లు తోపాటు రెండు రోజులకు ఒకసారి మాంసాహారాన్ని అందించాలి. ఆయా పదార్థాల్లో అధిక ఉప్పు, కారం, నూనె లేకుండా చూడాలి.

ఆలకించరు.. పట్టించుకోరు

మద్యపానం, ధూమపానంతో పాటు జంక్‌ఫుడ్‌తో ఆరోగ్యానికి హానికరమని ప్రభుత్వాలు హెచ్చరిస్తున్నాయి. జంక్‌ఫుడ్ నుంచి పిల్లలను రక్షించాలంటూ భారత ఆహార భద్రతా ప్రమాణాల సంస్థ(ఎఫ్ఎస్ఎస్ఏఐ) నిబంధనల్ని జారీ చేసింది. పాఠశాలలకు, వసతిగృహాలకు 50 మీటర్లు వరకు చిరుతిళ్ల దుకాణాలపై నిషేధించారు. దుకాణాల్లో అమ్మే చిరుతిళ్లపై అధికారులు తనిఖీలు చేయాలి. క్యాంటీన్‌లలో మిఠాయిలు, ఫ్రెంచ్‌ఫ్రైస్, బర్గర్లు, చిప్స్, పిజ్జా, సమోసాలు, నూడిల్స్, శీతలపానీయాలు పూర్తిగా నిషేధించింది. అయితే ఆ నిబంధనల్ని ఎవరూ పట్టించుకోవడంలేదు. ఇక ప్రభుత్వ హెచ్చరికల్ని ఎవరూ ఆలకించడంలేదు. జంక్‌ఫుడ్‌లలో అతి ప్రమాదకరంగా ఉండే రసాయనాలను ఎఫ్ఎస్ఎస్ఏఐ 2016లో నిషేధించింది. కానీ అవి జంక్‌ఫుడ్ తయారీదారులు వాటిని వాడుతూనే ఉంటారు. రుచి, ఫ్లేవర్, కలర్స్ అధిక తీపి కోసం వాడుతుంటారు. నిషేధిత ప్రొఫైల్‌గానెట్, పోటాషియం బ్రిమెట్, మోనోసోడియం గ్లూటామెట్, డైఏసిటల్‌తో పాటు అధిక తీపిని ఇచ్చే హైఫ్రక్టోజ్‌కార్నసిరప్ వంటి రసాయనాలను జంక్‌ఫుడ్ తయారీదారులు యథేచ్ఛగా వినియోగిస్తున్నారు. ఈ రసాయనాల వల్ల షుగర్, కిడ్నీ సమస్యలు తలెత్తున్నాయని దీనిపై నిషేధించారు. అయితే వీటిని అటు తయారీదారులు.. ఇటు వ్యవస్థలు పట్టించుకోవడంలేదు. దీంతో మార్కెట్‌లో యథేచ్ఛగా విక్రయాలు జరుగుతున్నాయి.

తల్లిదండ్రులదే బాధ్యత..

ఆరోగ్యంపై ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటాయనుకోవడం అపోహే అవుతుంది. అన్నిచోట్ల అందుబాటులో ఉంటున్న జంక్‌ఫుడ్ నుంచి నుంచి పిల్లలను రక్షించుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులపైనే ఉంది. వారికి ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందుబాటులో ఉంచే బాధ్యత కూడా పెద్దలదే. సొంతంగా తయారు చేసుకునే ఆహారం నిల్వ ఉన్నా అది అంతగా శరీరంపై ప్రభావం చూపదు. కానీ జంక్‌ఫుడ్ శరీరంలోనే పేరుకుపోయి నాడీ, జీర్ణవ్యవస్థ, మెదడు, గుండెతో పాటు 18 రకాల అవయువాల పనితీరుపై ప్రభావం చూపుతుంది. జంక్‌ఫుడ్‌కు అలవాటు పడిన పిల్లల ప్రవర్తన కూడా వింతగా ఉంటుంది. విపరీత మనస్తత్వంతోపాటు, చిన్న చిన్న కారణాలకు ఆవేదన చెందుతూ ఆత్మహత్యల వైపు వెళ్తూ ఉంటారని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

ఇంటింటి సర్వే నిర్వహించండి

- జ్వరపీడితులకు సత్వరమే చికిత్స
- పిడుగురాళ్లలో డీఎంహెచ్ఓ ఆకస్మిక తనిఖీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పిడుగురాళ్ల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలో జ్వరపీడితులను గుర్తించేందుకు వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించాలని పల్నాడు జిల్లా డీఎంహెచ్ఓ రవి ఆదేశించారు. ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన పిడుగురాళ్లలో పెరుగుతున్న సీజనల్ వ్యాధులు అనే కథనానికి స్పందించిన అధికారులు శనివారం పట్టణంలో పలు వార్డులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఎంపీడీఓ కార్యాలయం పరిసర ప్రాంతాలు, ప్రజాశక్తి నగర్‌తో పాటు గత ఏడాది లెనిన్‌నగర్‌లో అతిసార వ్యాధులకు గురైన పలు ప్రాంతాలకు వెళ్లి తనిఖీలు చేశారు. కొన్ని గృహాల ముందు డ్రమ్ములలో నిల్వ ఉన్న నీటిని పరిశీలించి ఇంటి యజమానులకు తగు సూచనలు చేశారు. డ్రమ్ములలో నీటిని నిల్వ ఉంచకూడదని తెలుపుతూ వాటిని కింద పడబోశారు. లెనిన్‌నగర్‌లోని ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించి వైద్య సిబ్బందికి తగు సూచనలు చేశారు. గతేడాది జరిగిన ఘటనలు పునరావృతం కాకుండా ఇంటింటి సర్వే నిర్వహించడంతో పాటు అవగాహన కల్పించాలన్నారు. నీటి శాంపిల్స్‌ను సేకరించి ల్యాబ్‌కు పంపాలని సిబ్బందిని ఆదేశించారు. డెంగ్యూ, మలేరియా వ్యాధులు దరిచేరకుండా ఉండేందుకు పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్, సబ్‌యూనిట్ అధికారి మహమ్మద్ గౌస్, మారుతీనగర్ పీహెచ్‌సీ వైద్యాధికారి నస్రీన్, సూపర్‌వైజర్ ఖలీమ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో మమతానుబంధం ఉండాలి

- డాక్టర్ లావు రత్తయ్య

గుంటూరు (విద్య), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులతో ఉపాధ్యాయులకు మమతానుబంధం ఉండాలని విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య తెలిపారు. చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్ విశ్వవిద్యాలయంలో శనివారం ఉపాధ్యాయుల దినోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన లావు రత్తయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు చదువుతో పాటు విలువలు కూడా నేర్పించాల్సిన బాధ్యత ఉందన్నారు. ఏ రంగంలోనూ లేని, ఉపాధ్యాయులకు మాత్రమే ఉన్న అతి గొప్ప అవకాశం సాధ్యమైనంత మంది శిష్యులను పొందడమేనని వెల్లడించారు. మరో ముఖ్యఅతిథిగా హాజరైన వర్సిటీ వైస్ చాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ మాట్లాడుతూ వర్తమాన సమస్యలను అధిగమించటమే కాకుండా, భవిష్యత్ తరానికి పునాది వేసే భాగ్యం ఉపాధ్యాయులుగా మనకు మాత్రమే కలిగిందన్నారు. కార్యక్రమంలో సీఈవో మేఘన కూరపాటి, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డీ.విజయరాము తదితరులు అధ్యాపకులను సత్కరించారు.



అధ్యాపకులను సత్కరిస్తున్న వీసీ నాగభూషణ్ తదితరులు

రాష్ట్రస్థాయి అవార్డు గ్రహీతలకు డీఈవో అభినందనలు



ఉత్తమ ఉపాధ్యాయులను అభినందిస్తున్న డీఈవో సీవీ రేణుక

గుంటూరు (విద్య), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన శారదానికేతన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన గణిత ఉపాధ్యాయిని పి.సునీత రజిని, జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన పి.లక్ష్మీప్రసన్న కుమారిలను డీఈవో సీవీ రేణుక శనివారం కార్యాలయంలో అభినందించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలను అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచినందుకు, గత సంవత్సరం 10వ తరగతి ఫలితాల్లో అత్యున్నత స్థానం సంపాదించినందుకు వారికి అభినందనలు తెలియజేశారు. అవార్డు పొందడం బాధ్యతను మరింత పెంచిందని ఈ సందర్భంగా వారు అన్నారు పాఠశాల ప్రధానోపాధ్యాయిని నర్రా ఉషాకుమారి ఉపాధ్యాయుల, సేవా సంస్థల సహకారంతో పాఠశాలను అభివృద్ధి చేయడంపై వారిని అభినందించారు కార్యక్రమంలో ఉర్దూ పాఠశాలల ఉపతనిఖీ అధికారి శ్రీఎండీ ఖాసిం పాల్గొన్నారు

పౌరసరఫరాల కమిషనర్ ఆదేశాలకు వక్రభాష్యం

- డోర్‌టూడోర్ స్మార్ట్‌రైస్ కార్డుల పంపిణీ చేయని సెక్రటరీలు
- రేషన్ షాపుల వద్ద కూర్చుని అక్కడికే రమ్మని సమాచారం
- డిపోల వద్ద కుప్పలు తెప్పలుగా కార్డులు
- బద్ధకిస్తున్న సెక్రటరీలపై చర్యలకు సిఫార్సు చేయకుండా వత్తాసు

గుంటూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ రైస్‌కార్డుల పంపిణీలో పౌరసరఫరాల శాఖ కమిషనర్ జారీ చేసిన ఆదేశాలకు జిల్లాలోని గ్రామ/వార్డు సచివాలయాల కార్యదర్శులు, పౌర సరఫరాల అధికారులు వక్రభాష్యం చెబుతున్నారు. ప్రతి ఒక్క లబ్ధిదారుడి ఇంటి వద్దకే వెళ్లి సెక్రెటరీలు పంపిణీ చేయాలని కమిషనర్ ఆదేశాలు జారీ చేయగా వాటిని లెక్క చేయడం లేదు. ఏ రేషన్ దుకాణంతో అయితే సెక్రెటరీలను మ్యాపింగ్ చేశారో అక్కడికి వెళ్లి కూర్చుంటున్నారు. ఆ షాపులో రేషన్ తీసుకోవడానికి వచ్చిన వాళ్లకు మాత్రమే పంపిణీ చేస్తున్నారు. ఈ కారణంగా జిల్లాలో రైస్‌కార్డుల పంపిణీ 20 శాతంలోపే ఉంది. ఈ విషయంపై అటు పౌరసరఫరాల అధికారలు, ఇటు జీఎస్‌డబ్ల్యూఎస్ వర్గాలు దృష్టి పెట్టడం లేదు. ప్రభుత్వ ఆదేశాలు పాటించకుండా బద్ధకిస్తోన్న సచివాలయాల కార్యదర్శులపై చర్యలకు సిఫార్సు చేయకుండా వాళ్లకు కొంతమంది అధికారులు వంత పాడుతున్నారు.

రేషన్ డిపోలలో సరుకులతో పాటు కార్డులు పంపిణీ చేయాలంటే ఇబ్బందే. దీంతో పౌరసరఫరాల కమిషనర్ ఆలోచన చేసి ఇంటింటికి వెళ్లి సచివాలయాల కార్యదర్శులు కార్డులు పంపిణీ చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రతి రేషన్ దుకాణాన్ని ఒక సెక్రెటరీకి మ్యాపింగ్ చేశారు. వాళ్ల స్మార్ట్‌ఫోన్‌లోనే కార్డు పంపిణీ చేయడానికి యాప్‌ని ఇన్‌స్టాల్ చేశారు. ఆ యాప్ ద్వారా లాగిన్ అయి కార్డు నంబరు నమోదు చేసి లబ్ధిదారుల వేలిముద్రను తీసుకొని కార్డు పంపిణీ చేయాలి. ఇది ఒక విధంగా సామాజిక పింఛన్ల పంపిణీ లాంటిదే. అయినప్పటికీ వారు ఆ పనిచేయడం లేదు. అదేమంటే తమకు క్లస్టర్‌లోని చిరునామాల గురించి మాత్రమే అవగాహన ఉంటుందని చెబుతున్నారు. రేషన్ డిపో పరిధిలో కార్డుదారుల చిరునామాలు తెలియవని తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు.

జిల్లాలో 5,88,693 స్మార్ట్ రైస్‌కార్డులు పంపిణీ చేయాల్సి ఉంది. 5వ తేదీ ముగిసినా ఇప్పటివరకు 20శాతం కూడా పంపిణీ చేయ లేదు. గుంటూరు నగరంలో అయితే రెండు నియోజకవర్గాలు కలిపి 20 వేల లోపే కార్డుల ను పంపిణీ చేశారు. ఇందుకు కారణం సచివాలయాల కార్యదర్శులు ఇంటింటికి వెళ్లకపోవడమే. పైగా రేషన్ షాపు వద్ద కూర్చుని అక్కడికి రమ్మని సమాచారం ఇస్తున్నారు. కుటుంబసభ్యుల్లో ఎవరు వెళ్లినా వాళ్ల పేరు నమోదు చేసి కార్డు పంపిణీ చేయాలి. అయితే కేవలం కార్డు యజమాని వస్తేనే ఇస్తామని వెనక్కు పంపిస్తుండటంతో ఉసూరుమంటూ ఎండలో వెనుదిరుగుతున్నారు. జిల్లా యంత్రాంగం అంతా తురకపాలెం మరణాలపై కేంద్రీకృతం కావడం, జాయింట్ కలెక్టర్ బదిలీ అవడం, పూర్తిస్థాయి పౌరసరఫరాలశాఖ అధికారి లేకపోవడం వెరసి స్మార్ట్ రైస్‌కార్డుల పంపిణీ జిల్లాలో నత్తనడకన కొనసాగుతోంది.



ఆదర్శనగర్‌లో మూతబడిన రేషన్ దుకాణాలు

మూతబడిన రేషన్ షాపులు

రేషన్ సరుకుల నిల్వలు కొన్ని దుకాణాల్లో అయిపోయాయని షాపులు తెరవడం లేదు. గుంటూరు నగరంలోని ఆదర్శనగర్ మెయిన్‌రోడ్డు, ఏడో లైనులోని రెండు డిపోలను శుక్ర, శనివారాలలో మూసేశారు. శ్రీరాంనగర్ మెయిన్‌రోడ్డులోని దుకాణం వద్ద నిలువ నీడ లేకపోవడంతో సరుకులు తీసుకొనేందుకు వచ్చిన కార్డుదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. శ్రీనివాసరావుపేటలోనూ ఇదే పరిస్థితి తలెత్తింది. పార్వతీపురంలో 155 నంబరు దుకాణం అయితే ఉదయం 10 గంటల తర్వాతే తీస్తున్నారు. దీనిపై తక్షణం అధికారులు దృష్టి పెట్టకపోతే ఈ నెలలో చాలామంది సరుకులకు దూరం అయ్యే పరిస్థితి ఏర్పడుతుంది.



శ్రీరాంనగర్ మెయిన్‌రోడ్డులో మండుటెండలోనే సరుకులు తీసుకొనేందుకు క్యూకట్టిన ప్రజలు

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

ఆంధ్రజ్యోతి
దినపత్రికలో అన్ని రకముల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
సంప్రదించండి 99854 11227 99854 02292

నేడు ఆలయాల మూసివేత

పొన్నూరుటౌన్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): చంద్రగ్రహణం కారణంగా పొన్నూరు పట్టణంలోని ప్రసిద్ధ సహస్రలింగేశ్వర స్వామి, వీరాంజనేయ స్వామి, సాక్షి భవనారాయణ స్వామి ఆలయాలను ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు మూసివేయనున్నట్లు ఆలయ నిర్వాహకులు శనివారం తెలిపారు. సోమవారం ఉదయం సంప్రోక్షణల అనంతరం ఆలయాలను తెరవనున్నట్లు చెప్పారు.

13న జాతీయ లోక్ అదాలత్

పొన్నూరుటౌన్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఈ నెల 13న స్థానిక సివిల్ కోర్టులో జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, మెజిస్ట్రేట్ ఏఖ పవన్ కుమార్ కోరారు. స్థానిక సివిల్ కోర్టులో శనివారం బార్ అసోసియేషన్ న్యాయవాదులతో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పవన్ కుమార్ మాట్లాడుతూ అదాలత్‌లో రాజీ పడదగిన అన్ని కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదలు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జీఎం రమేష్ బాబు

ఖాతాదారుల సంక్షేమమే లక్ష్యం

పొన్నూరుటౌన్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఖాతాదారుల సంక్షేమ లక్ష్యంగా కెనరా బ్యాంకు సేవలో అందిస్తోందని.. జనరల్ మేనేజర్ రమేష్ బాబు పేర్కొన్నారు. ఇటికంపాడు గ్రామంలో శనివారం ములుకుదురు శాఖ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి సురక్ష యోజనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యయ అతిథి జీఎం రమేష్ బాబు మాట్లాడుతూ ఖాతాదారులు బ్యాంకు ఖాతాలకు ఈకేవైసీ చేయించుకోవడం ద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాలకు అర్హులవుతారని చెప్పారు. ఏజీఎం రాజకుమార్, డివిజనల్ మేనేజర్లు కార్తీక్, మోహన్, బ్రాంచ్ మేనేజర్ వెంకట్రావు పాల్గొన్నారు.

వైసీపీ అనుబంధ సంఘాల నియామకాలు

తెనాలి అర్బన్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): వైసీపీ అనుబంధ సంఘాల నేతలను శనివారం ప్రకాశంరోడ్డులోని పార్టీ కార్యాలయంలో సత్కరించారు. మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మాట్లాడుతూ, కమిటీల సభ్యులంతా నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. నియోజకవర్గ మహిళ విభాగం అధ్యక్షురాలిగా కుర్రా యశోద, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా పొట్లూరి అశోక్, సాంస్కృతిక విభాగం అధ్యక్షుడిగా అద్దేపల్లి లక్ష్మణశాస్త్రిని నియమించారు. కిషోర్, భూషణం, దుబాయ్‌బాబు, శాంతిశ్రీ, జయప్రద, హేమలత పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాల ఏర్పాటుకు రూ.8.15 కోట్లు

● ఎమ్మెల్యే ధూళిపాళ్ళ


ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్

పొన్నూరుటౌన్, సెప్టెంబరు6(ఆంధ్రజ్యోతి): పొన్నూరు నియోజకవర్గంలో నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.8.15 కోట్లు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ శనివారం తెలిపారు. 13 నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మరమ్మతులకు ఈ నిధులు వినియోగించనున్నట్లు వెల్లడించారు. పెదకాకాని, చేబ్రోలులో రెండు, నారాకోడూరులో రెండు, శ్రీరంగపురం, శుద్ధపల్లి, వడ్లమూడి, పొన్నూరు మండలంలోని ఆరెమండ, బ్రాహ్మణ కోడూరు, నండూరు, పచ్చలతాడిపర్రు గ్రామాల్లో నూతన పీహెచ్‌సీలు నిర్మించనున్నట్లు చెప్పారు. నూతన భవనాల నిర్మాణం కోసం రూ. 7.15 కోట్లు మంజూరైనట్లు చెప్పారు. పెదకాకాని మండలంలోని నంబూరు, పెదకాకాని, చేబ్రోలు మండలంలోని చేబ్రోలు, శెలపాడు, పొన్నూరు మండలంలోని దొప్పలపూడి, ములుకుదురు ఆరోగ్య కేంద్రాలకు రూ. 1.50 కోట్ల నిధులతో మరమ్మతులు చేపట్టనున్నట్లు వివరించారు.

ప్రభుత్వ వైద్యశాలను తనిఖీ చేసిన జిల్లా కో-ఆర్డినేటర్

తెనాలి అర్బన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలను ఆసుపత్రి సేవల జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ రంగారావు శనివారం తనిఖీ చేశారు. జిల్లాలో వైరల్ ఫీవర్లు పెరుగుతున్న నేపథ్యంలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగుల ఆరోగ్యాన్ని సమీక్షించారు. డాక్టర్ల వైద్య సాయం, మందుల పంపిణీ, నర్సుల సేవలను రోగులను అడిగి తెలుసుకున్నారు. జ్వర కేసులను క్షుణ్ణంగా పరిశీలించాలని సూపరింటెండెంట్ సౌభాగ్యవాణి, డాక్టర్లను కోరారు. తురకపాలెం నుంచి సేకరించిన 125 రక్త నమూనాలను విశ్లేషించే బాధ్యతను తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు అప్పగించినట్లు చెప్పారు.


రోగులతో మాట్లాడుతున్న జిల్లా కో-ఆర్డినేటర్ రంగారావు

సచివాలయ ఉద్యోగుల దశలవారీ ఆందోళన


చైర్‌పర్సన్ రాధికకు వినతి పత్రం అందిస్తున్న సచివాలయ ఉద్యోగులు

తెనాలి అర్బన్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగుల తమ సమస్యల పరిష్కారం కోరుతూ దశలవారీ ఆందోళన చేపట్టారు. శనివారం నల్లరిబ్బన్లు ధరించి మున్సిపల్ ఛైర్ పర్సన్ తాడిబోయిన రాధికకు వినతిపత్రం అందజేశారు. సమ్మె నోటీసులు ఇవ్వడం, నల్లరిబ్బన్లు ధరించడం, అధికారిక వాట్సాప్ గ్రూపుల నుండి వైదొలగడం, పెన్‌డౌన్, నిరసనలు, రాష్ట్రవ్యాప్త సమ్మె చేపట్టనున్నట్లు తెలిపారు. సిబ్బందికి పనులభారం పెరుగుతుందని, సర్వేలు, మల్టీ టాస్కింగ్ కారణంగా ఇబ్బందులు పడుతున్నామని ఫలితంగా కుటుంబ జీవనానికి దూరం కావడంతో పాటు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని పేర్కొన్నారు. ఒకే మాతృశాఖ కింద పని చేసేలా ఆదేశాలు ఇవ్వాలని, పని భారం తగ్గించాలని, ప్రమోషన్లు, యూఎల్‌బీ ఖాళీల భర్తీ, ఏఏఎస్ వర్తింపు, అదనపు ఇంక్రిమెంట్లు వంటి డిమాండ్లతో మెమోరాండం అందించారు.


విలేకర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఆలపాటి

కొలిక్కి వచ్చిన అర్బన్ బ్యాంకు వ్యవహారం

● ఏకగ్రీవానికి కూటమి నిర్ణయం: ఎమ్మెల్సీ ఆలపాటి

తెనాలి అర్బన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : తెనాలి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు వ్యవహారం కొలిక్కి వచ్చింది. ఛైర్మన్ పదవిని కూటమిలోని ఇద్దరు నేతలు ఆశిస్తున్న నేపథ్యంలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజజేంద్రప్రసాద్ అందరిని కూర్చోబెట్టి ఏకగ్రీవం చేసేందుకు చర్చించారు. నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో శనివారం చర్చలు అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ, అర్బన్ బ్యాంకు పూర్వం నుంచి ఎంతో మంది పెద్దలు పరిపాలించి ప్రతిష్ట పెంచారని చెప్పారు. ఆ ప్రతిష్టను కాపాడేలా మనందరం వ్యవహరించాలని, పార్టీ క్రమశిక్షణ కూడా ఉల్లంఘించకూడదన్నారు. కూటమిలోని టీడీపీకి ఆరు డైరెక్టర్లు, జనసేనకు నాలుగు డైరెక్టర్లు, బీజేపీకి ఒకటి ఇచ్చేలా మాట్లాడినట్లు చెప్పారు.ఈ సమావేశంలో పార్టీ నాయకులు మంగమూరి హరిప్రసాద్, గుమ్మడి రమేష్, అన్నం పిన్నారావు, పెండేల వెంకట్రావు, కౌన్సిలర్ వెంకటేశ్వరరావు, వాసుదేవనాయుడు పాల్గొన్నారు.


వినాయకుని గ్రామోత్సవం నిర్వహిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

ముగిసిన చవితి ఉత్సవాలు

తెనాలి అర్బన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మారీసుపేట శివాలయంలో నిర్వహిస్తున్న వినాయక చవితి ఉత్సవాలు శనివారం ముగిశాయి. స్వామివారికి విశేష పూజలు జరిపి పట్టణంలో ఘనంగా ఊరేగించారు. అనంతరం తూర్పు కాల్వలో నిమజ్జనం చేశారు. ప్రధాన అర్చకులు పణిశర్మ, కమిటీ అధ్యక్షుడు గ్రంధిసేతు మాధవరావు, పొన్నూరు శశి, శేషగిరిరావు, అంకమ్మరాజు, హరి పాల్గొన్నారు.

ముగిసిన వినాయక నిమజ్జనోత్సవాలు

కొల్లిపర, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో వినాయక నిమజ్జనోత్సవాలు అత్యంత వైభవంగా శనివారం ముగిశాయి. ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌పై ఉంచి మేళతాళాలతో, కనక తప్పెట్లుతో ఊరేగింపు నిర్వహించారు. మహిళలు హారతులు ఇచ్చి తమ భక్తి భావాన్ని చాటుకున్నారు. కృష్ణానదీలో నిమజ్జనం చేశారు.

అధ్యాపకురాలు హేమలతకు సత్కారం


ముఖ్యమంత్రి, విద్యామంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న హేమలత

తెనాలి అర్బన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జేఎంజే కళాశాలలో గృహ విజ్ఞాన శాస్త్రం హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ పాటిబండ్ల హేమలత రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యామంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న ఆమెను శనివారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో సత్కరించారు. కరస్పాండెంట్ గాదె థెరిసమ్మ మాట్లాడుతూ అంకితభావంతో విధులు నిర్వహిస్తారని, విద్యార్థులలో స్ఫూర్తి కలిగించే విధంగా బోధన చేస్తారని చెప్పారు. గృహ విజ్ఞాన విభాగాన్ని విద్యార్థులు మెచ్చుకునే స్థాయిలో నిర్వహిస్తారని ఆమెకు అవార్డు లభించడం కళాశాలకు గర్వకారణమన్నారు. ప్రిన్సిపల్ సిస్టర్ శాంత, వైస్ ప్రిన్సిపల్ రోజ్‌లీన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది బాధ్యతగా పనిచేయాలి

● ఎంపీడీవో విజయలక్ష్మి


సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో విజయలక్ష్మి

కొల్లిపర, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): సచివాలయం సిబ్బంది బాధ్యతగా పని చేయాలని ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. శనివారం మండల పరిధిలోని దావులూరు, చక్రాయపాలెం సచివాలయాలను ఆమె తనిఖీ చేశారు. సచివాలయంలోని రికార్డులను పరిశీలించి, సూచనలు, సలహాలు ఇచ్చారు. విజయలక్ష్మి మాట్లాడుతూ సచివాలయానికి వచ్చిన ప్రతి దరఖాస్తును పరిశీలించారన్నారు. అనంతరం అత్తోట సచివాలయాన్ని తనిఖీ చేసి పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో భార్గవ్, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖాధికారులు పాల్గొన్నారు.

గురువులను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత


గురువులకు సన్మానిస్తున్న రోటరీ నిర్వాహకులు

పొన్నూరుటౌన్, సెప్టెంబరు6(ఆంధ్రజ్యోతి): గురువులను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని రోటరీ క్లబ్ అధ్యక్షుడు జీఎంస్ గుప్తా అన్నారు. రోటరీ, ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం గురుపూజోత్సవాలు నిర్వహించారు. ఉపాధ్యాయులు కొల్లి రమేష్ బాబు, పంచుమర్తి వీర శ్రీనివాసరావు, బత్తుల శివ కుమారి, మండే విజయలక్ష్మి, మహమ్మద్ సల్మా ఖాతూన్, అంబటి వకుళ, క్రాంతి నాగమణి, పొట్ల ప్రవీణ్ కుమార్, ఆరుమళ్ళ బేబీ కుమారి, అంబటి శివ కోటేశ్వరావును ఘనంగా సత్కరించారు.

పేదల ఆర్థికాభివృద్ధికి బ్యాంకర్లు సహకరించాలి

● డీసీసీ, డీఎల్ఆర్‌సీ సమావేశంలో కేంద్ర మంత్రి పెమ్మసాని

గుంటూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కౌలు రైతులకు పంట రుణాలతో పాటు, పేదల ఆర్థికాభివృద్ధికి స్వయం ఉపాధి, పరిశ్రమల ఏర్పాటుకు బ్యాంకర్లు సహకరించాలి. ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా బ్యాంకు లింకేజీ రుణాల మంజూరుకు బ్యాంక ర్లు చిత్తశుద్ధితో పనిచేయాలని కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని శంకరన్ సమావేశమందిరంలో బ్యాంకర్ల జిల్లా సంప్రదింపుల కమిటీ(డీసీసీ), జిల్లా స్థాయి సమీక్ష కమిటీ(డీఎల్ఆర్‌సీ) సమావేశం జరిగింది. ప్రాధాన్య రంగాలైన వ్యవసాయశాఖకు సంబంధించి స్వల్పకాలిక రుణాలు, కౌలు రైతులకు పంట రుణాలు, అనుబంధ శాఖలకు సంబంధించి పశుపోషణకు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు రుణాలు, విద్యా, హౌసింగ్ రుణాలు, విశ్వకర్మ, పీఎం సూర్యఘర్ తదితర పథ కాలకు నిర్దేశించిన లక్ష్యాలు, వాటిలో పూర్తి చేసినవి, లక్ష్యాలను పూర్తి చేయలేకపోవటానికి గల కారణాలు, వాటి పరిష్కార మార్గాలపై బ్యాంకులు, పథకాల వారీగా డాక్టర్ పెమ్మసాని సమీక్షించి సూచనలు అందించారు. జిల్లా వార్షిక రుణ ప్రణాళికను విడుదల చేశా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పబ్లిక్, ప్రైవేటు రంగం బ్యాంకులు సామాజిక బాధ్యతగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం ప్రవేశపెట్టిన పథకాలకు నిర్దేశించిన లక్ష్యాల మేరకు ఖచ్చితంగా రుణాలు మంజూరు చేయాలన్నారు. ప్రస్తుతం వ్యవసాయం చేస్తున్నది కౌలు రైతులే అని భూయజమానులకు కాకుండా కౌలు రైతులకే బ్యాంకర్లు పంట రుణాలు మంజూరు చేయాలన్నారు. జిల్లా క్రెడిట్ యాక్షన్ ప్లాన్‌పై ప్రతి మూడు నెలలకు ఒకసారి బ్యాంకులు, పథకాల వారీగా సూక్ష్మ స్థాయిలో సమీక్షిస్తారన్నారు. బ్యాంకులు నిర్దేశించిన లక్ష్యాలను తప్పనిసరిగా అధిగమించాలన్నారు. కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ సీసీఆర్‌సీ కార్డులు జారీ చేసిన వారికి పంట రుణాలు బ్యాంకర్లు ఖచ్చితంగా మంజూరు చేయాలన్నారు. ఈ సమావేశంలో తాడికొండ, ప్రత్తి పాడు, గుంటూరు తూర్పు, పశ్చిమ ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్‌కుమార్, బూర్ల రామాంజ నేయులు, గళ్లా మాధవి, నసీర్ అహ్మద్‌లు ప్రసంగించారు. యూనియన్ బ్యాంక్ డీజీఎం జవహర్, డీఆర్వో ఎన్ఎస్‌కే ఖాజావలి, లీడ్ బ్యాంక్ మేనేజరు మహిపాల్ రెడ్డి, ఇండియన్ బ్యాంకు డీజీఎం గౌరీశంకర్, ఆర్బీఐ ఎల్డీవో గిరిధర్, నాబార్డు డీడీఎం శరత్ బాబు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి నాగేశ్వరరావు, జిల్లా ఉద్యానశాఖ అధికారి రవీందర్ బాబు, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజరు జయలక్ష్మి పాల్గొన్నారు.

అవసరమైన అన్ని రహదారులు నిర్మిస్తాం

● ఛైర్‌పర్సన్ రాధిక


రహదారి నిర్మాణానికి కొబ్బరికాయ కొడుతున్న ఛైర్‌పర్సన్ రాధిక

తెనాలి అర్బన్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి) : పట్టణంలో అవసరమైన అన్ని రహదారులను నిర్మిస్తామని మున్సిపల్ ఛైర్ పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. 15వ వార్డులోని మల్లాది వారి వీధిలో రూ.13.25 లక్షలతో 135 మీటర్ల మేర నిర్మించనున్న రహదారికి శనివారం కొబ్బరికాయ కొట్టారు. కమిషనర్ శ్రీకాంత్, డీఈ శ్రీనివాసులు, కౌన్సిలర్లు సంజీవరెడ్డి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు

● ఏఓ శ్రీనివాసరెడ్డి


తనిఖీ చేస్తున్న ఏవో శ్రీనివాసరెడ్డి

కొల్లిపర, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయని.. కృతిమ కొరత సృష్టిస్తే వారిపై తగిన చర్యలు తీసుకోనున్నట్లు ఏఓ శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. శనివారం మండలంలోని మున్నంగి, వల్లభాపురం, కొల్లిపర తదితర గ్రామాల్లో ఎరువుల దుకాణాలను ఆయన ఆయన తనిఖీ చేశారు. ఏఓ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రైతులు ఎవరూ కూడా ఎరువులు లేవని కంగారు పడాల్సిన అవసరం లేదన్నారు. యూరియాను అధికంగా నిల్వఉంచిన వారిపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు తెలియజేశారు.

అమెరికా టారిఫ్‌లపై సీపీఎం నిరసన


మాట్లాడుతున్న నన్నపనేని శివాజీ

పెదకాకాని, సెప్టెంబర్ 6(ఆంధ్రజ్యోతి): సీపీఎం ఆధ్వర్యంలో అమెరికా భారత్ పై విధించిన టారీఫ్‌లను వ్యతిరేకిస్తూ సుందరయ్య కాలనీలో నిరసన ప్రదర్శన శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం పెద్దకాకాని మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ మాట్లాడుతూ.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారతీయ సరుకుల దిగుమతులపై సుంకాన్ని 50 శాతం పెంచుతున్నట్లు ప్రకటించారని, ఇవే కాకుండా ఆయిల్ మా వద్ద కాకుండా రష్యా వద్ద కొంటే మరింతగా టారిఫ్‌లు పెంచుతామని బెదిరిపులకు దిగుతున్నార న్నారు. టారిఫ్‌ల పెంపుదలతో భారత ఉత్పత్తులపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. గుంటూరు జిల్లాలో స్పిన్నింగ్ మిల్లుల కార్మికులు ఎక్కువ ఇబ్బందులు పడుతారన్నారు. కేంద్రంలో మోదీ అధికారంలోకి వచ్చాక భారత ప్రయోజనాల్ని, దేశసార్వభౌమత్వాన్ని అమెరికాకి తాకట్టు పెట్టే విధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. సీపీఎం శాఖ కార్యదర్శి బి.బాబురావు, బి సాంబయ్య, ఆర్ వెంకటరమణ, ఏ నాగేశ్వరావు, షేక్ మరింబి, షేక్ మస్తానమ్మ, సీతా రావమ్మ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపైనే.. సమాజ నిర్మాణ బాధ్యత



తహసీల్దార్, ఉపాధ్యాయులను సన్మానిస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

తెనాలి అర్బన్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): సమాజ నిర్మాణ బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని తహసీల్దార్ గోపాలకృష్ణ పేర్కొన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో నేషనల్ బిల్డర్ అవార్డులను ప్రదానం చేశారు. రోటరీ కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్, పలువురు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. క్లబ్ ఉపాధ్యక్షురాలు డాక్టర్ జీవనలత అధ్యక్షత వహించారు. క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకటపూర్ణచంద్, గుత్తా వెంకటరత్నం, హరిప్రసాద్, జీవీ నారాయణ, డాక్టర్ రవీంద్రనాథ్, ఈదర శ్రీనివాసరావు, జగదీశ్వరాంబ, రాంబాబు, బుజ్జి పాల్గొన్నారు.


ప్రదర్శన నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

టారిఫ్ ప్రభావ రంగాలను ఆదుకోవాలి

పొన్నూరుటౌన్, సెప్టెంబరు6(ఆంధ్రజ్యోతి): అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన టారిఫ్‌తో ప్రభావితమయ్యే రంగాలకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ డిమాండ్ చేశారు. శనివారం భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలోని ఐలాండ్ సెంటర్‌లో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ భారతీయ సరుకుల దిగుమతిపై 50 శాతం పన్నులు విధించడం సరికాదన్నారు. ట్రంప్ నిర్ణయంతో రాష్ట్రంలో ఆక్వా, టెక్స్టైల్, గార్మెంట్ రంగాలపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. రొయ్యల ధరలు పతనం కావడంతో తీర ప్రాంత రైతులు కష్టాల్లో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా నాట్య మండలి జిల్లా కార్యదర్శి ఆరేటి రామారావు, షేక్ గౌస్, దేవరకొండ శ్రీనివాస్, నాగరాజు, సాంబయ్య, బాబురావు, బుచ్చిబాబు, ముక్కాల రాజు, శంకరరావు, సుబ్బయ్య పాల్గొన్నారు.

మానవత్వం చాటిన శ్రీశివలింగేశ్వర భక్త బృందం


అంత్యక్రియలు నిర్వహిస్తున్న భక్త బృందం

తెనాలి క్రైం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తెనాలికి చెందిన శ్రీశివలింగేశ్వర భక్త బృందం మరోమారు తమ మానవత్వం చాటుకుంది. ఇటీవల జరిగిన రెండు వేర్వేరు ఘటనల్లో ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి ఇద్దరు మృతి చెందారు. చత్తీస్‌ఘడ్‌కు కమలేష్‌కుమార్(22), జంగారెడ్డిగూడేనికి చెందిన నూకవరపు అప్పయ్య(22) మృతదేహాలను.. తెనాలి రైల్వే ఎస్ఐ జి.వెంకటాద్రి మార్చురీలు భద్రపరిచారు. మృతదేహాలను తరలించే ఆర్థిక పరిస్థితులు లేవని కుటుంబసభ్యులు వేడుకోవడంతో శ్రీశివలింగేశ్వర స్వామి భక్తబృందం ముందుకువచ్చి సొంత ఖర్చులతో బుర్రిపాలెం రోడ్డులోని మహాప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహించారు. సేవా సమితి అధ్యక్షులు కుర్రా శ్రీను పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానం

చేబ్రోలు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు ఎంఆర్‌సీ దగ్గర గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారులు రఘుచలపతిరావు, ఆర్.సుబ్బారావు ఆధ్వర్యంలో మండల ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన నలుగురు ఉపాధ్యాయులతో పాటు.. మండలస్థాయిలో ఆరుగురు ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. యూటీఎఫ్, ఏపీటీఎఫ్, ఎస్టీయూ నాయకులు, సీఆర్పీలు పాల్గొన్నారు.


సన్మానం అందుకున్న ఉపాధ్యాయులు

బహిరంగ ప్రకటన

మా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, మాచర్ల బ్రాంచ్ వారి సూచనలు పొంది యిందుమూలముగా యావన్మందికి తెలియచేయునది ఏమనగా... **జింకల వెంకటరెడ్డి** గారి భార్య **జింకల సీతమ్మ** గారి ఆస్థిని తనఖా పెట్టుకొని ఋణము పొందుటకు సంప్రదించినారు. కావున ఈ దిగువ షెడ్యూలు ఆస్థికి సంబంధించి ఎవరికైనా అభ్యంతరములు, క్లయిములు ఉన్నచో 7 రోజులలోపు తెలియ చేయవలయును. ఎట్టి అభ్యంతరములు, క్లయిములు రానిచో మా క్లయింట్ సదరు **జింకల సీతమ్మ** గారికి ఋణం మంజూరు చేయును. **షెడ్యూలు** : నర్సరావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా, మాచర్ల స.రి. యిలాకా వెల్దుర్తి మండలం, శిరిగిరిపాడు శివారు మిట్టమీదపల్లె గ్రామ డి.నెం. 533/2లో డోర్ నెం. 7-101, అసెస్మెంట్ నెం. 09రు కలిగి నా తాలూకు నీకు సెటిల్‌మెంట్ చేసి, స్వాధీనపరచిన యింటికి హద్దులు **తూర్పు** : వల్లెపు హనుమయ్య ఆస్థి, **దక్షిణం** : జింకల హనిమిరెడ్డి ఆస్థి, **పడమర** : శ్రీశైలం రోడ్డు, **ఉత్తరం** : షేక్ ఇస్మాయిల్ షాపు, ఈ హద్దుల మధ్య గల 48.4 చ.గల స్థలం, యిందులో 440 చ.అ.ల రేకుల కప్పుతో నిర్మించిన యింటితో సహా. DOC NO : 4531/2021, S.R.O. మాచర్ల.

లంకా విజయ్‌కుమార్, లంకా వంశీకృష్ణ,
న్యాయవాదులు, 2వ లైను, రవీంద్ర నగర్, గుంటూరు.
సెల్ నెం.9030595227, 9848052914

ఆర్యవైశ్య హాస్టల్‌లో.. ఉచిత భోజనం

తెనాలి అర్బన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బస్ స్టేషన్ వద్ద ఉన్న ఆర్యవైశ్య హాస్టల్‌లో ఉచిత వసతి భోజన సదుపాయం లభిస్తుందని వైశ్య విద్యానిధి కార్యదర్శి పెండేల వెంకట్రావు తెలిపారు. తెనాలి శ్రీకన్యకా పరమేశ్వరి వైశ్య విద్యానిధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హాస్టల్‌లో ఇంటర్ నుంచి పీజీ వరకు చదువుకునే విద్యార్థులు ప్రవేశం పొందాలని కోరారు. 25 గదుల్లో 100 మంది వరకు వసతి పొందే అవకాశం ఉందన్నారు.

విద్యార్థిని శ్రీలక్ష్మికి అభినందనలు

పెదకాకాని, సెప్టెంబర్ 6(ఆంధ్రజ్యోతి): ఉప్పలపాడు జడ్పీ హైస్కూల్లో జరిగిన టీచర్స్ డే సందర్భంగా జడ్పీ స్కూల్లో ఫస్ట్ వచ్చిన విద్యార్థిని తాడిబోయిన శ్రీలక్ష్మిని అభినందించారు. శనివారం విద్యార్థినికి బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు నాగేశ్వరరావు , గ్రామ సర్పంచి శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ బూసి బాబు, టీడీపీ గ్రామ ప్రెసిడెంట్ సుబ్బారావు కార్యక్రమానికి హాజరై తాడి శ్రీలక్ష్మిని అభినందించారు. ప్రముఖ నాటక రచయిత తాతారావు యాదవ్ కుమార్తె తాడి శ్రీలక్ష్మి.

గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు

ఆంధ్రజ్యోతి
దినపత్రికలో అన్ని రకముల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
సంప్రదించండి
98484 11050
99854 03281

ఎస్పీ సతీష్‌కుమార్ ఆకస్మిక తనిఖీ



స్టేషన్‌లో ఎస్పీ సతీష్‌కుమార్

కాకుమాను, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): కాకుమాను పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ ఎస్. సతీష్‌కుమార్ శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. మండలంలో శాంతి భద్రతల గురించి వాకబు చేశారు. వినాయక చవతి నిమజ్జనాల ప్రక్రియ గురించి అడిగి తెలుసుకున్నారు. రౌడీషీటర్‌ల కదలికలపై నిఘా పెంచాలన్నారు. స్టేషన్ పరిసరాలు పచ్చదనంగా ఉండడం పై సంతృప్తి వ్యక్తం చేశారు. ట్రైనీ ఎస్ఐ వెంకట రమణ, హెచ్‌సీ ప్రభాకర్, కానిస్టేబుళ్ల శ్రీకాంత్ ఉన్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది



విశ్రాంత ఉపాధ్యాయులకు సత్కారం

పెదనందిపాడు,సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని పీఏఎస్ కళాశాల ప్రిన్సిపాల్ జి.వీరరాఘవయ్య అన్నారు. స్థానిక అశోకా పాఠశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా శనివారం గురుపూజోత్సవం నిర్వహించారు. విశ్రాంత ఉపాధ్యాయులు కొల్లా హనుమంతరావు, అంచా రత్తయ్యను ఘనంగా సత్కరించారు. పాఠశాల వ్యవస్థాపకులు పోపూరి లక్ష్మీనారాయణ, డైరెక్టర్ పోపూరి నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'మాస్టరింగ్ క్వాంటమ్ కంప్యూటరింగ్' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కళాశాల అధ్యక్షుడు సత్యనారాయణ

పెదనందిపాడు, సెప్టెంబరు, 6(ఆంధ్రజ్యోతి): స్థానిక పీఏఎస్ కళాశాలలో ప్రిన్సిపాల్ జి. వీరరాఘవయ్య రచించిన మాస్టరింగ్ క్వాంటమ్ కంప్యూటరింగ్ పుస్తకాన్ని శనివారం కళాశాల అధ్యక్షుడు కాళహస్తి సత్యనారాయణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఈ పుస్తకం ఎంతో దోహదపడుతుందన్నారు. రానున్న కాలంలో ఏఐతో పాటు క్వాంటమ్ కంప్యూటరింగ్ కూడా కోర్సుల్లో ఒక భాగమవుతుందన్నారు. పుస్తక రచయిత వీరరాఘవయ్యను ప్రత్యేకంగా అభినందించారు. విజ్ఞాన్ డిగ్రీ అండ్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అనురాధ, అధ్యాపకులు కె.ప్రతాప్, ఎ.శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి

పెదనందిపాడు,సెప్టెంబరు, 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో లక్ష్మీదేవి అన్నారు. మండల పరిధిలోని గ్రామాల్లో పంచాయతీ సిబ్బంది మన మిత్రలో భాగంగా వాట్సాప్ గవర్నెన్స్‌పై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీడీవో పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రభుత్వం ప్రజలకు పథకాలను చేరువ చేసేందుకు వాట్సాప్ గవర్నెన్స్‌ను ప్రవేశపెట్టిందని, దీని ద్వారా నేరుగా లబ్ధిదారులు ధృవీకరణ పత్రాలను పొందవచ్చునని తెలిపారు.

తొగట వీర క్షత్రియ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

మంగళగిరి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తొగట వీర క్షత్రియ కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలని తొగట వీర క్షత్రియ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మిశెట్టి కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. మంగళగిరి ఐబీఎన్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. చేనేత కులంలో తొగట వీర క్షత్రియులు కీలకంగా ఉన్నారని చెప్పారు. ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలని టీడీపీ కేంద్ర కార్యాలయంలో వినతిపత్రం అందజేసినట్టు తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షుడు అనంత మల్లికార్జునరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించి సామాజిక వర్గం అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర కోశాధికారి నరమాల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు పల్లా కోటేశ్వరరావు, చిత్తూరు అధ్యక్షుడు మల్లయ్య, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు వెంకట నారాయణ, తిరుపతి అధ్యక్షుడు మందపల్లి బాబు, రాయలసీమ జిల్లాల అధ్యక్షుడు వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

దళిత రక్ష కరదీపిక ఆవిష్కరణ

మంగళగిరి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆర్మీ ట్రస్టు కార్యాలయంలో శనివారం సాయంత్రం దళిత రక్ష కర దీపికను ఆవిష్కరించారు. బొందు అకాడమీ డైరెక్టర్ బొందు నాగేశ్వరరావు మాట్లాడుతూ 2012లో ప్రారంభించిన దళిత రక్ష రాజకీయ, సామాజిక, సాంస్కృతిక, విద్య, ఆరోగ్య, జాతీయ, అంతర్జాతీయ విశేషాలను ప్రజలకు చేరవేస్తుందని తెలిపారు. దళిత రక్ష ఎడిటర్ కారుమంచి రామారావు, ట్రస్టు కార్యదర్శి డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అనంతపద్మనాభ స్వామి సామూహిక వ్రతం



శ్రీఅనంత పద్మ నాభస్వామి వ్రతం

దుగ్గిరాల, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శ్రీఅనంత పద్మనాభ స్వామి సామూహిక వ్రతాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. భాద్రపద శుద్ధచతుర్దశి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామివారిని ప్రత్యేకంగా 23 రకాల పుష్పాలతో కనుల పండువగా అలంకరించారు. కొంగర సుధీర్‌కుమార్, వంకదార ఫణి, పలువురు కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.


విద్యార్థులకు ఎలక్ట్రానిక్స్‌పై శిక్షణ



శిక్షణలో సీఈవో డాక్టర్ సాంబశివరావు

వట్టిచెరుకూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఏపీ శాస్త్ర సాంకేతిక మండలి డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ అనుమతితో కాట్రపాడు గ్రామంలోని పోలిశెట్టి సోమసుందరం హైస్కూల్‌లో డాక్టర్ హనుమంతరావు చారిటబుల్ ట్రస్ట్ అనుబంధ సంస్థ సుగుణా సైన్స్ అకాడమి ప్రతినిధులు విద్యార్థులకు శనివారం ఎలక్ట్రానిక్ విభాగంలో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. వెహికల్ రివర్స్ కోర్ని అనే పరికరాన్ని తయారు చేశారు. సుగుణా సైన్స్ అకాడమీ సీఈవో డాక్టర్ చివుకుల సాంబశివరావు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించగా హెచ్ఎం రమేష్ కుమార్, ఫిజికల్ సైన్స్ అధ్యాపకులు రాంబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పొగాకు రైతుల ఆందోళన



రాస్తారోకో చేస్తున్న రైతులు

వట్టిచెరుకూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 5వ మైలులో ఏర్పాటు చేసిన పొగాకు కొనుగోలు కేంద్రంలో బయ్యర్ పొంతన లేని సమాధానంతో ఇబ్బంది పెడుతున్నాడని కాకుమాను, పెదనందిపాడు, ప్రకాశం జిల్లాలకు చెందిన కొంత మంది రైతులు శనివారం 5వ మైలు వద్ద కొద్ది సేపు రాస్తారోకో నిర్వహించారు. పొగాకు బోర్డు అధికారి ప్రతినిధి సుబ్రహ్మణ్యం రైతుల వద్దకు వచ్చి సమస్యను తెలుసుకొని తానే స్వయంగా కొనుగోలు నిర్వహిస్తాననడంతో రైతులు శాంతించి రాస్తారోకో విరమించారు.

యూరియా సరఫరాలో ఎలాంటి ఇబ్బందుల్లేవు

● ఏఎంసీ చైర్మన్ జవ్వాది కిరణ్‌చంద్



యూరియా బస్తాలను తీసుకువెళుతున్న రైతులు

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మార్కెట్ యార్డు పరిధిలో యూరియా సరఫరాకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు లేవని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జవ్వాది కిరణ్‌చంద్ స్పష్టం చేశారు. మంత్రి నారా లోకేశ్ సహకారంతో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా యూరియా సరఫరా చేస్తున్నామని, రైతుల అవసరాల మేరకు సరిపడా నిల్వలు ఉన్నాయని తెలిపారు. రైతు సేవా కేంద్రాలు, సొసైటీల ద్వారా నియోజకవర్గంలోని రైతులందరికీ యూరియా సరఫరా చేస్తున్నామన్నారు. ఇతర నియోజకవర్గాల రైతులు కూడా మంగళగిరి నుంచి యూరియా తీసుకువెళుతున్నారని చెప్పారు. మంగళగిరిలో యూరియా కొరత వుందంటూ కొంత మంది సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఖరీఫ్ సీజన్‌లో 995 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా, ఇప్పటికే 1,034 మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేశామని తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ బాధ్యత

● కేఎల్‌యూ అవగాహన సదస్సులో కొమెర అంకారావు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రభుత్వ సలహాదారు అంకారావు

తాడేపల్లి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వన్ ఎర్త్ వన్ లైఫ్, కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం వడ్డేశ్వరంలోని కేఎల్‌యూ గ్రీన్‌ఫీల్డ్ ప్రాంగణంలో ప్రకృతి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిస్తూ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కొమెర అంకారావు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని, ప్రతి చిన్న మార్పు పెద్ద ఫలితాలకు దారి తీస్తుందన్నారు. ఇంటిలో నుంచే ప్రకృతి సంరక్షణ ప్రారంభించాలని పిలుపునిచ్చారు. అలాగే విద్యార్థులు పర్యావరణ పరిరక్షణపై ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలన్నారు. గుంటూరు జిల్లా అటవీ శాఖాధికారిణి ఎం.హిమశైలజ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణం గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. వన్ ఎర్త్ వన్ లైఫ్ వ్యవస్థాపకురాలు లీలాకుమారి ఏలూరి మాట్లాడుతూ ప్రస్తుతం ఆకుకూరలు, కాయకూరలు పురుగుమందులు లేకుండా ఉత్పత్తి చేసేందుకు మిద్దె తోటలను తాము విజయవాడ వేదికగా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. అనంతరం ప్రతి ఒక్కరికి ఒక మొక్క అందజేశారు. కేఎల్‌యూ డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, వర్సిటీ కార్యదర్శి కోనేరు కాంచనలత, వీసీ డాక్టర్ జిపార్థసారధివర్మ, ప్రోవీసీలు డాక్టర్ ప్రసాద్, వెంకటరాం, రాజశేఖరరావు, రిజిస్ట్రార్ కె.సుబ్బారావు, శాక్ డైరెక్టర్ పి సాయివిజయ్, తాడేపల్లి తహసీల్దార్ డి సీతారామయ్య పాల్గొన్నారు.

బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై ఒప్పందాలు



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ప్రిన్సిపాల్ రామారావు, కంపెని డైరెక్టర్ వెంకటేశ్వరరావు

తాడికొండ(లాం) సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై లాం చలపతి ఫార్మసీ కళాశాల, సేఫ్ ఎన్విరాన్ ప్రైవేట్ లిమిటెడ్ పరస్పర ఒప్పందాలను శనివారం చేసుకున్నారు. ఫార్మసీ కళాశాలలో సురక్షిత వైద్యం, స్వచ్ఛమైన పర్యావరణం అనే అంశంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సేఫ్ ఎన్విరాన్ కంపెనీ డైరెక్టర్ వెలగపూడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జీవ వైద్య వ్యర్థాలు ఆసుపత్రులు, డయాగ్నస్టిక్ సెంటర్లు, బ్లడ్ బ్యాంకులు, ప్రయోగశాలలు తదితర వాటి నుంచి వెలవడే వ్యర్థాలు ప్రమాదకరమన్నారు. భారత ప్రభుత్వం 2016లో బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్‌ను ప్రవేశ పెట్టిందన్నారు. చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ నాదెండ్ల రామారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సంగం డెయిరీలో 156 రకాల పాల ఉత్పత్తులు



మాట్లాడుతున్న సంగం డెయిరీ డైరెక్టర్ కంచర్ల శివరామయ్య

తాడికొండ, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): సంగం డెయిరీ 156 రకాల పాల ఉత్పత్తులు తయారీ చేసి మార్కెటింగ్ చేస్తుందని డెయిరీ డైరెక్టర్ కంచర్ల శివరామయ్య పేర్కొన్నారు. శనివారం అమరావతి మండలం 14వ మైలు సెంటర్, ఉంగుటూరు వద్ద బీఎంసీ సెంట్‌లో పాల ఉత్పత్తిదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంగం డైరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ సారథ్యంలో రూ.2,018 వేల కోట్ల టర్నోవర్ సాధించిందని తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లిలో 46 ఎకరాలు కొనుగోలు చేసి సంగం డెయిరీని నిర్మిస్తున్నట్లు తెలిపారు. తిరుపతి జిల్లా నాయుడు పేటలో 22.80 ఎకరాలు కూటమి ప్రభుత్వం డెయిరీ నిర్వహణకు భూములు కేటాయిందన్నారు. పాల పదార్థల మీద జీఎస్టీ తగ్గించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. డెయిరీ డైరెక్టర్ ధర్మారావు, ప్రొక్యూర్‌మెంట్ జనరల్ మేనేజర్ ఆదినారాయణ, వెటర్నరీ డాక్టర్ కృష్ణచైతన్య, లేమల్లే బీఎంసీ మేనేజర్ ఆనంద్ పాల్గొన్నారు.

పారిశుధ్యం లోపిస్తే అధికారులపై కఠిన చర్యలు

● ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): తన నియోజకవర్గంలో పారిశుధ్యం లోపిస్తే సంబంధిత అధికారులపై చర్యలు ఉంటాయని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజ నేయులు హెచ్చరించారు. గుంటూరు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శనివారం జరిగిన నియోజకవర్గ సమీక్ష సమావేశానికి అధ్యక్షత వహించి ఆయన మాట్లాడారు. ఏ గ్రామంలో నైనా తాగునీరు ప్రజలకు సక్రమంగా అందాలని, అదేవిధంగా పారిశుధ్యం సక్రమంగా నిర్వహించాలన్నారు. ప్రజలకు అందాల్సిన సౌకర్యాలు అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే సంబంధిత శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తానన్నారు. సీఈఓ జ్యోతిబసు మాట్లాడుతూ సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. వెంటనే వాటిని పరిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా ఒక గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ ఏడు నెలల క్రితం తాను రూ.70 వేల పనులు పనులు చేశానని, బిల్లుల విషయంలో అధికారులు తనను తిప్పిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై అధికారులు వివరణ ఇస్తూ నాలుగు రోజుల్లో విడుదల చేస్తామని చెప్పారు. డీఎల్‌డీఓ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

అమెరికా టారిఫ్‌లపై వామపక్షాల నిరసన



బోసుబొమ్మ సెంటర్‌లో వామపక్షాల నిరసన

పెదనందిపాడు,సెప్టెంబరు, 6(ఆంధ్రజ్యోతి): స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌లో వామపక్షాల ఆధ్వర్యంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దిగుమతి సరుకులపై 50శాతం సుంకాల పెంపు నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తూ శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. సీపీఎం మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్‌బాబు మాట్లాడుతూ అమెరికా నిర్ణయాల వలన ఆక్వా, టెక్స్‌టైల్, గార్మెంట్స్ రంగాలు పూర్తిగా దెబ్బతింటున్నాయన్నారు. దీని వలన మహిళా కార్మికులకు ఉపాధి కోల్పోతారన్నారు. నాయకులు వెంకటశివరావు, రామారావు, వెంకటేశ్వర్లు, వెంకటసుబ్బారావు, రాజేంద్ర పాల్గొన్నారు.

మోదీ నోరు విప్పాలి

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సామ్రాజ్యవాద అమెరికా అభివృద్ధి చెందుతున్న దేశాలపై విధిస్తున్న అదనపు పన్నులను వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై నేతాజీ డిమాండ్ చేశారు. అమెరికా విధించిన పన్ను టారిఫ్‌లను నిరసిస్తూ పట్టణంలోని బోసుబొమ్మ సెంటర్‌లో సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. సీపీఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నేతాజీ మాట్లాడుతూ అమెరికా దుందుడుకు పన్నుల విధానానికి చైనా, భారత్, రష్యా ఒకే వేదిక మీదకు రావడాన్ని స్వాగతించారు. సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి కంచర్ల కాశయ్య మాట్లాడుతూ విశ్వగురు అని చెప్పుకుంటున్న ప్రధాని మోడీ అమెరికా సుంకాల విధింపు విధానంపై నోరు విప్పాలని డిమాండ్ చేశారు. సీపీఐ, సీపీఎం నేతలు పాల్గొన్నారు. ఉండవల్లి అమరారెడ్డి నగర్‌లో సీపీఎం రాజధాని నేతలు ఎం.రవి, వల్లభాపురం వెంకటేశ్వరరావు, జగదీశ్వర్‌రెడ్డి, పార్థసారధి, ఆర్‌వి రాఘవయ్య, ఇమ్మాను యేలురాజు నిరసన తెలిపారు. కుంచనపల్లిలో పల్లె కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన నిరసనలో వై నేతాజీ, దొంతిరెడ్డి వెంకటరెడ్డి, రంగారావు, రామారావు, సుబ్బారావు, విజయరాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గణేశ్ శోభాయాత్ర

● నిమజ్జనానికి తరలిన భారీ గణనాథులు



గణేశ్ శోభాయాత్రలో సంప్రదాయ దుస్తుల్లో యువత

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి పట్టణంలో గణేశ్ శోభాయాత్ర శనివారం రాత్రి అత్యంత వైభవంగా జరిగింది. గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళగిరిలో సామూహిక గణేశ్ నిమజ్జనోత్సవాన్ని శనివారం నిర్వహించారు. పట్టణంలోని వివిధ కూడళ్లలో కొలువైన భారీ గణనాథుని విగ్రహాలను నిమజ్జనోత్సవానికి తరలించారు. పాతమంగళగిరి సీతారామస్వామి కోవెల కేంద్రంగా శోభాయాత్ర ప్రారంభమైంది. రేవేంద్రపాడు వంతెన వద్ద కాలువలో వినాయకుని విగ్రహాలను నిమజ్జనం చేశారు.

● తాడికొండ: మండలంలో శనివారం తాడికొండ, పొన్నెకల్లు, నిడుముక్కల, లాం తదితర గ్రామాల్లో వినాయక నిమజ్జనాలు కమిటీ నిర్వాహకులు చేపట్టారు. నిడుముక్కలలో లడ్డూ ప్రసాదం వేలం నిర్వహించగా రూ.3,99,999కు పాడుకున్నారు. గ్రామా నికి చెందిన ఆర్యా, సునీల్, భాను, దినేష్, ప్రదీప్ లడ్డూను దక్కించుకున్నారు.

● దుగ్గిరాల: మండలంలోని పలు గ్రామాల్లో వినాయక నిమజ్జనోత్సవాలు శనివారం పెద్దయెత్తున నిర్వహించారు. దుగ్గిరాల రథం సెంటర్లోని శ్రీలక్ష్మీగణపతి ఆలయం వద్ద ఉత్సవాల్లో గ్రామోత్సవం నిర్వహించారు. చిలువూరు గ్రామంలో వినాయకచవితి ఉత్సవాల అనంతరం జరిపిన లడ్డూను వేలంపాటలో గ్రామానికి చెందిన బండ్లమూడి కృష్ణప్రసాద్ రూ.1,80, 116లకు దక్కించుకున్నారు.

● తాడేపల్లి టౌన్: సీతానగరం మారుతీ కాలనీ 20వ వార్డుకు చెందిన వరసిద్ధి వినాయక సేవా కమిటీ ఆధ్వర్యంలో గణేష్ విగ్రహానికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. జనసేన నియోజకవర్గ నేత జొన్నా రాజేష్, రాష్ట్ర ఐటీ విభాగం కోఆర్డినేటర్ చవ్వాకుల కోటేష్ బాబు హాజరయ్యారు. లడ్డూ ప్రసాదాన్ని వేలంలో రూ.40,100కు కేఎల్ రావు కాలనీ, 19వ వార్డు జనసేన ఉపాధ్యక్షుడు వీరిశెట్టి వెంకటేశ్వరరావు, నంద్యాల శ్రీనివాసరావు, జనసేన టీం దక్కించుకుంది.

● తాడేపల్లి: తాడేపల్లి బైపాస్‌లోని నారా లోకేశ్ క్రీడా ప్రాంగణంలో గణనాథనికి శుక్రవారం రాత్రి కుంకుమపూజలు నిర్వహించారు. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు సింగర్ రాధా కుమారి పాల్గొని అన్నమాచార్య సంకీర్తనలు ఆలపించారు. రాష్ట్ర నాటక అకాడమి చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ శ్రీకృష్ణుడి వేషంలో ఆకట్టుకున్నారు. ముఖ్య అతిథిగా పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ విచ్చేసి కుంకుమ పూజలు నిర్వహించారు. కోమటి జయరాం, గుమ్మడి గోపాలకృష్ణ, ముమ్మడి సత్యనారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బైక్‌పై నుంచి పడి మహిళ మృతి

ప్రత్తిపాడు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బైక్ పై వెనుక కూర్చున్న మహిళ పొరబాటున జారిపడి మరణించిన ఘటన మండల పరిధిలోని తుమ్మలపాలెం వద్ద జాతీయ రహదారిపై జరిగింది. హైదరాబాదులో నివాసం ఉండే తమనం ప్రమీల (40) తన మామయ్య సంవత్సరికం కోసం భర్త నాగరాజుతో కలిసి శుక్రవారం రాత్రి హైదరాబాదు నుంచి బయలు దేరింది. ఉదదయం గుంటూరు నుంచి ద్విచక్ర వాహనంపై చిలకలూరిపేట సమీపంలోని రాగన్నపాలేనికి బయలు దేరారు. బైక్‌కు తగిలించిన బ్యాగ్ జారిపోతుండటంతో ప్రమీల దానిని చేసే క్రమంలో బ్యాలెన్స్ తప్పి కిందపడింది. అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. ఈ మేరకు ప్రత్తిపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ ఏఈగా.. మురళీకృష్ణ బాధ్యతలు

పెదనందిపాడు,సెప్టెంబరు, 6(ఆంధ్రజ్యోతి): మండల విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీరుగా దొడ్డా మురళీకృష్ణ శనివారం బాధ్యతలు చేపట్టారు. పొన్నూరు జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ పదోన్నతి పొంది బదిలీపై ఆయన ఇక్కడకు విచ్చేశారు. ఇక్కడ పనిచేస్తున్న ఎన్.కరుణాకర్ చిలకలూరిపేటకు బదిలీపై వెళ్లారు. కార్యాలయ సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

నేడు ఉపకార వేతనాల పంపిణీ

పెదనందిపాడు, సెప్టెంబరు, 6(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో పెదనందిపాడు ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు 14వ విడత ఉపకార వేతనాలను ఆదివారం పంపిణీ చేయనున్నట్లు అధ్యక్షుడు దాసరి శేషగిరిరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ నంబూరు శివనాగేశ్వరరావు, పారిశ్రామికవేత్త దేశు సూర్యప్రకాశరావు పాల్గొననున్నట్లు తెలిపారు.

డివైడర్‌ను ఢీకొట్టి.. కాల్వలోకి దూసుకెళ్లిన బస్సు

● 8 మందికి స్వల్పగాయాలు

పెదనందిపాడు, సెప్టెంబరు, 6(ఆంధ్రజ్యోతి): గుంటూరు-పర్చూరు రహదారిలో ఏబీపాలెం సాగర్ కాలువ వద్ద శనివారం ఉదయం ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు రోడ్డు ప్రమాదానికి గురైంది. స్థానికుల వివరాల మేరకు.. హైదరాబాదు నుంచి బాపట్ల వస్తున్న బస్సు కాలువపైనున్న డివైడర్‌ను ఢీకొట్టి సైడు కాల్వలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో క్లీనర్ రమేష్‌కు నడుముకు బలమైన గాయమైంది. బస్సులు 16మంది ప్రయాణికులు ఉన్నారు. అందులో 8మందికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు చేరుకుని వివరాలు సేకరించారు.

జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీగా శిరీష

దుగ్గిరాల, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లాస్కూల్ గేమ్స్ సెక్రటరీగా దుగ్గిరాల మండలం రేవేంద్రపాడు జడ్పీ హైస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయిని కొల్లిపర శిరీష నియమితులయ్యారు. ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు రేవేంద్రపాడు హైస్కూల్ క్రీడాకారుల ఎంపికయ్యేందుకు శిక్షణ ఇచ్చిన శిరీష స్కూల్ గేమ్స్ సెక్రటరీగా తన సేవలను అందించాలని హెచ్ఎం బీవీ కృష్ణారావు, ఉపాధ్యాయులు ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు శిరీషను శనివారం ఘనంగా సత్కరించారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

వట్టిచెరుకూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముట్లూరు గ్రామంలో శనివారం కూటమి నాయకులు ఇంటింటికి వెళ్లి రైస్ స్మార్ట్ కార్డులు పంపిణీ చేశారు. గ్రామ మాజీ సర్పంచ్ వీరిశెట్టి జగన్‌మోహన్‌రావు, వార్డు మెంబరు బి.శ్రీనివాసరావు, జనసేన నాయకులు దశరథ రామయ్య, వెంకటేశ్వర్లు, తంబి, ఎనుముల రాంబాబు, నాగయ్య, కిషోర్ పాల్గొన్నారు.



కార్డులు పంపిణీ చేస్తున్న కూటమి నాయకులు

గ్రామాభివృద్ధికి.. కృషి చేయాలి

ఫిరంగిపురం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): నూతనంగా ఫిరంగిపురం పీఏసీఎస్ అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన కటికల రామకోటేశ్వరరావు పార్టీ నాయకులను కలుపుకొని గ్రామాభివృద్ధికి కృషి చేయాలని మండల టీడీపీ నాయకులు బత్తుల వేణుగోపాల్ బాబు అన్నారు. శనివారం మండంలోని వేములూరిపాడు పంచాయతీ కార్యాలయ ఆవరణలో కటికల రామకోటేశ్వరరావును ఘనంగా సన్మానించారు. తెలుగుదేశం పార్టీలో బీసీలకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం, ఉదాహరణకు రామకోటేశ్వరరావు అని ఆయన తెలిపారు. సర్పంచ్ కొరివి చిన ఆనంద్, కొండవీటి రచయితల సంఘం అధ్యక్షులు సయ్యద్ రఫీ, టీడీపీ నాయకులు పచ్చల రత్నరాజు, అరీఫుల్లా, పి. సీతారామరాజు, లక్ష్మణ్, జహంగీర్, జూలూరి గోపీ, మాదాను థామస్ పాల్గొన్నారు.

అర్ధాకలితో పారిశుధ్య కార్మికులు

తుళ్లూరు సెప్టెంబరు 6: (ఆంధ్రజ్యోతి) : పని విరామ సమయంలో జరిగిన పారిశుధ్య కార్మికుల నిరసనలో శనివారం నిరసన వ్యక్తం చేశారు. గౌరవ అధ్యక్షుడు ఎం.రవి పాల్గొని మాట్లాడారు. ఏపీ రాజధాని అమరావతిలో పారిశుధ్య విధులు నిర్వహిస్తున్న కార్మికులకు మూడో నెల గడుస్తున్నా.. జీతాలు చెల్లించకపోవడం అన్యాయమన్నారు రాజధాని పారిశుధ్య కార్మికులకు నెలల తరబడి జీతాలు చెల్లించకుండా.. అర్ధాకలితో..వారి కడుపులు కాల్చడం అలవాటుగా మారిందన్నారు. కార్మికులు ఆందోళన చేస్తే తప్ప, జీతాలు చెల్లించిన పరిస్థితి రాజధానిలో నెలకొందన్నారు.